# క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
11-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 109

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని
# మొలకెత్తనివ్వం

- తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు 26 కు పెరుగుతాయి
- 119 అసెంబ్లీ స్థానాలు 182 కు పెరుగుతాయి
- 182 అసెంబ్లీ స్థానాల్లో 117 సీట్లు గెలిచి రెండోసారి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది
- భద్రాచలం రాములవారి మీద ఆన... ఇది ఖమ్మం కాంగ్రెస్ కార్యకర్తల మాట
- ఒకరిపై ఒకరు పోటీగా ఒకాయన కన్నెపల్లికి పోయి పంపులు ఆన్ చేయాలంటాడు
- బ్యాడుమేళం బ్యాచ్ లా బీఆరెస్ సర్వేల బ్యాచ్ తయారైంది
- బీజేపీ లోకి వెళ్ళనని హరీష్ రావును కెసీఆర్ పై ఒట్టేసి చెప్పమను
- బీఆరెస్ ను బీజేపీ లో విలీనం చేస్తారని నీ సొంత చెల్లెలే చెబుతోంది
- ఆంధ్ర కాంట్రాక్టర్లు బీఆరెస్ కి వందల కోట్లు ఇచ్చారని నీ సొంత చెల్లే చెప్పింది

మిగతా 2లో

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:**

తెలంగాణలో రాష్ట్రం లో రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 182 అసెంబ్లీ స్థానాలకు 117 సీట్లు గెలిచి రెండవసారి కాంగ్రెస్ పార్టీ అధి కారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా తుది విడత నిధులను బటన్ నొక్కి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

మిగతా 2లో

## ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత..

- నాయుడుపేటలో రూ.1,595 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న షిన్హ్యూప్
- ఈ ప్లాంట్ ద్వారా 2,170 మందికి ఉద్యోగ అవకాశాలు
- శ్రీసిటీలో ఈవీ విడిభాగాల యూనిట్ ఏర్పాటు చేయాలని మోటివ్‌లింక్‌కు విజ్ఞప్తి
- ఏపీలో ఎండ్-టు-ఎండ్ పీసీబీ క్లస్టర్ ఏర్పాటుకు సహకరించాలని కోరిన లోకేశ్



2లో



## సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...

- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం
- ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం మూడు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- రాష్ట్రంలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు సరికొత్త విధానానికి గ్రీన్ సిగ్నల్

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

మిగతా 2లో


## మాట తప్పుడు.. పార్టీలు మారడం నీ సంస్కృతి

**రేవంత్ 20 ఏళ్ల రాజకీయ చరిత్రనే దానికి నిదర్శనం**

**ఆయనలా ఒట్టు వేసి ఒక మాట, వేయకుండా మరోమాట చెప్పే అలవాటు నాకు లేదు : హరీశ్‌రావు**


హైదరాబాద్: మాట తప్పడం..పార్టీలు మారడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ సంస్కృతి కావొచ్చుని, తనది కాదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు అన్నారు. రేవంత్ 20 ఏళ్ల రాజకీయ చరిత్ర, తన 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానమే అందుకు నిదర్శనమన్నారు. రేవంత్‌లా ఒట్టు వేసి ఒకమాట, ఒట్టు వేయకుండా మరోమాట చెప్పే అలవాటు తనకు లేదని చెప్పారు. భద్రాద్రి శ్రీరాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానని చేసిన ప్రమాణం ఏమైందని ప్రశ్నించారు.





## ఇరాన్‌పై అనుమానాస్పద దాడులు

- పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు, పేలుళ్లు
- తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటన
- బహ్రెయిన్, జోర్డాన్, కువైట్, ఖతార్‌పై ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్



2లో

## అయోధ్యలో విరాళాల చోరీపై.. 13న సుప్రీం విచారణ

యూపీ పోలీసుల దర్యాప్తుపై నమ్మకం లేదు

సీబీఐతో దర్యాప్తు చేయించాలంటూ దాఖలైన పిటిషన్లు



## ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు

- పవన్‌ను లక్ష్యంగా చేసుకుని జడా శ్రావణ్, ప్రకాశ్ రాజ్, రావణ్ కుట్ర అంటూ మంత్రి ఫైర్
- వీరి వెనుక వైసీపీ, తాడేపల్లి స్క్రిప్ట్ ఉందని కందుల దుర్గేశ్ ఆరోపణ
- జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయో శ్రావణ్ చెప్పాలని డిమాండ్
- ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకే మత ఘర్షణలు రెచ్చగొడుతున్నారని ఫైర్
- ప్రశ్నించడం అంటే బూతులు తిట్టడమేనా అని తీవ్ర విమర్శ

2లో

# చెన్నైలో బిగ్ బాష్

**డిసెంబర్‌లో ఆస్ట్రేలియా టి--20 క్రికెట్ ఆరంభ మ్యాచ్**

**భారత్‌లో తొలిసారిగా విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్**

**క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించిన మోదీ, అల్బనీస్**



మెల్‌బోర్న్: శిక్షణ, క్రీడా విజ్ఞానం, సాంకేతికత, క్రీడా పరిశ్రమ రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని భారత్, ఆస్ట్రేలియా నిర్ణయించుకున్నాయి. ఇందుకోసం శుక్రవారం క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించాయి. ఇందులో భాగంగా తమిళనాడు రాజధాని చెన్నైలో బిగ్ బాష్ లీగ్ (టీ--20) ఆరంభ మ్యాచ్ నిర్వహించనున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో చెన్నైలోని ఎం.ఎ.చిదంబరం స్టేడియం (చేపాక్) వేదికగా జరగనున్న

మిగతా 2లో



## అయోధ్యలో విరాళాల చోరీపై.. 13న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: అయోధ్య రామాలయం విరాళాల చోరీ వ్యవహారంలో సీబీఐ దర్యాప్తు, ఆర్థిక లావాదేవీల ఆడిట్ కోరుతూ దాఖలైన మూడు పిటిషన్లపై విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. వేసవి సెలవుల అనంతరం కోర్టు పునఃప్రారంభమయ్యే రోజున, ఈ నెల 13న ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనుంది. రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందే విరాళాలు, కానుకలు చోరీకి గురవుతున్నాయని, నిధులు దురి?వనియోగమవుతున్నాయని న్యాయవాదులు అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్, ఆర్జేడీ ఎంపీ సుధాకర్ సింగ్, నరేంద్ర కుమార్ గోస్వామి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు ఎలాంటి క్రిమినల్ కేసు నమోదు కాలేదన్నారు. నిధుల గల్లంతు విషయాన్ని తేల్చేందుకు పూర్తి పారదర్శకత కోసం సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐతో నిర్దిష్ట కాల పరిమితిలోగా దర్యాప్తు జరిపించాలని కోరారు. అలాగే, ట్రస్ట్ ఆర్థిక లావాదేవీలపై కాగ్ లేదా స్వతంత్ర సంస్థతో ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు. ప్రత్యేక అర్హతలు లేని సిట్ విచారణ కంటే ఇటువంటి దర్యాప్తు ప్రజల్లో మరింత నమ్మకాన్ని కలిగిస్తుందని తెలిపారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆలయ సీసీటీవీ ఫుటేజీలు, డిజిటల్ లావాదేవీల రికార్డులు, బ్యాంకు ఖాతాల వివరాలను భద్రపరిచేలా ఆదేశాలివ్వాలని వారు అభ్యరి?థంచారు. అంతకుముందు, జూన్ 29న ఈ వ్యవహారంపై అత్యవసర విచారణ జరపాలని పిటిషనర్లు కోరగా.. అప్పటి వెకేషన్ బెంచ్ తోసిపుచ్చింది. 'వేసవి సెలవుల తర్వాత కోర్టు తిరిగి పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాక ఈ పిటిషన్లను విచారిస్తే కొంపలేమీ మునిగిపోవు'అని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించడం తెల్సిందే. తదుపరి విచారణను జూలై 13వ తేదీకి వాయిదా వేసింది.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం...

(మొదటి పేజీ తరువాయి)

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రు తిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు.

### భారీ పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.

### అమరావతిపై కీలక నిర్ణయాలు

అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంతాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.

### విద్యారంగానికి పెద్దపీట

సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు (జశీఅషవతీం), కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు కూడా అవకాశం కల్పిస్తుంది.

### సాగునీటి ప్రాజెక్టులు, జల సంరక్షణ

సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశు గ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు.

### భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.

# చెన్నైలో బిగ్ బాష్

(మొదటి పేజీ తరువాయి)

ఆస్ట్రేలియన్ మెన్స్ బిగ్ బాష్ లీగ్(బీబీఎల్) ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ పెర్త్ స్కార్చర్స్ జట్టుతో మెల్‌బోర్న్ రెనెగేడ్స్ తలపడనుంది. తద్వారా భారతదేశంలో ఒక విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తుండడం ఇదే మొదటిసారి కానుంది. మొదటి మ్యాచ్ చెన్నైలో, మిగిలిన మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలో జరుగుతాయి. ఎనిమిది జట్లు పాల్గొనే బీబీఎల్.. ఐపీఎల్ తర్వాత ప్రపంచంలోనే అత్యధిక ఆదరణ పొందిన దేశీయ క్రికెట్ టీ--20 లీగ్‌లలో ఒకటి కావడం విశేషం. ఇది సాధారణంగా డిసెంబర్ నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో జరుగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ శుక్రవారం ప్రతిష్టాత్మక మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇద్దరు నేతలు స్టేడియం అంతటా కలియతిరుగుతూ సందడి చేశారు. ఫోన్‌లో సెల్ఫీలు దిగారు. ఫొటోలకు పోజులిచ్చారు. ప్రజలకు అభివాదంచేస్తూ ఉత్సాహపర్చారు. పరస్పరం ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'చెన్నైలో బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ నిర్వహిస్తుండడం నాకు సంతోషంగా ఉంది. భారతదేశంలో మ్యాచ్‌లు నిర్వహించే ఏ క్రీడా లీగ్ అయినా భారీగా ప్రేక్షకులను ఆకర్షించడం ఖాయం"అని మోదీ పేర్కొన్నారు. భారత్--ఆస్ట్రేలియా క్రీడా సహకార రోడ్‌మ్యాప్‌ను మోదీ, అల్బనీస్ సంయుక్తంగా విడుదల చేశారు. క్రీడా శిక్షణ, క్రీడా విజ్ఞానం, సాంకేతికత, క్రీడా పరిశ్రమ, పెట్టుబడుల రంగాల్లో భాగస్వామ్యాలను ప్రోత్సహించాలన్నదే ఈ రోడ్‌మ్యాప్ ఉద్దేశం. రోడ్‌మ్యాప్‌లో భాగంగా యువ క్రీడాకారుల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించడానికి, క్రీడా సంబంధాలను బలోపేతం చేయడానికి ఇరు దేశాలు యూత్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహించబోతున్నాయి. ప్రజలను ఏకం చేసే శక్తి క్రీడలకు ఉందని, ఈ రోడ్‌మ్యాప్ భారత్, ఆస్ట్రేలియా మధ్య క్రీడా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి తోడ్పడుతుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మహిళల క్రికెట్ ప్రపంచ కప్ గెలిచినందుకు ఆస్ట్రేలియాను అభినందించారు. భారత్, ఆస్ట్రేలియాలు అంతర్జాతీయ క్రీడల్లో ఒక ముఖ్యమైన దశాబ్దంలోకి అడుగుపెడుతున్నాయని పేర్కొన్నారు. క్రీడల పట్ల ఉన్న ప్రేమ, అభిరుచి ఆస్ట్రేలియా, భారత్‌ను ఐక్యం చేశాయని ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ వ్యాఖ్యానించారు.

### విపక్ష నేతతో మోదీ భేటీ

ఆస్ట్రేలియా ప్రతిపక్ష నాయకుడు యాంగస్ టేలర్‌తో ప్రధాని మోదీ శుక్రవారం సమావేశమయ్యారు. భారత్--ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలపై వారిద్దరూ చర్చించుకున్నారు. ఇరుదేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై అభిప్రాయాలు పంచుకున్నారు. మోదీ మూడు రోజుల ఆస్ట్రేలియా పర్యటన శుక్రవారం ముగిసింది

# ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని మొలకెత్తనివ్వం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో పదేళ్ల పాటు బీఆర్ ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వారిపాలనలో రైతుల కు బేడీలు వేశారని మండిపడ్డారు.దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023 లో ఓ అద్భుతం జరిగింది. కాంగ్రెస్ పార్టీ లోకి అడుగుపెట్టిన పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెంట ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్ళీ మొలకెత్తనివ్వరు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ డబ్బు మూటలను కాంగ్రెస్ తట్టుకోలేదని కొందరు అన్నారు. అయితే 65 సీట్లలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని చెప్పి మరీ గెలిచి చూపించాం. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆ పార్టీకి గుండు సున్నా వచ్చేలా చేశామన్నారు. 2028 డిసెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగవు. తెలంగాణలో 2029 జూన్‌లోనే అసెంబ్లీ ఎన్నికలు వస్తాయి. 2029లో జరిగే కురుక్షేత్రంలో మళ్లీ గెలిచేది కాంగ్రెస్సే. పార్లమెంట్ సీట్లు 26, అసెంబ్లీవి 182కి పెరుగుతాయి. 182లో 117 సీట్లు గెలిచి రెండోసారి ప్రజాపాలన వస్తుంది. భద్రాచల రాముడిపై ఆన ఇది కాంగ్రెస్ కార్యకర్తల ప్రతిజ్ఞ అన్నారు . కల్వకుంట్ల కౌరవ కుటుంబాన్ని పాతాళా నికి తొక్కుతాం. పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌లో బంధించాం. ఆ పాపాల భైరవుడికి ఇకపై విముక్తి లేదు. ఆనాడు వరి వేస్తే ఉరి వేసినట్లే అని



కేసీఆర్ అన్నారు. కానీ మేం వ్యవసాయం దండగ కాదు పండుగ అన్నాం. పేదలకు సన్నబియ్యం వడ్లకు బోనస్ అందిస్తున్నాం. అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్ల ల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభు త్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్ల పై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విష ప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.సలసల మాడి పోతారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్. ఆనాడు డబుల్ బెడ్ రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారని అన్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్ లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని సీఎం రేవంత్ రెడ్డి వాఖ్యానించారు.బీజేపీ లో చేరెందుకు హరీశ్ రావు, మంతనాలు జరుపుతున్నారో లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలన్నారు.

## ఆ ముగ్గురూ పవన్‌ను టార్గెట్ చేశారు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వైసీపీ భారీ కుట్రకు తెరలేపిందని, అందులో భాగంగానే జడా శ్రావణ్ కుమార్, నటుడు ప్రకాశ్ రాజ్, యూట్యూబర్ జోసెఫ్ రావణ్ పనిచేస్తున్నారని రాష్ట్ర మంత్రి, జనసేన నేత కందుల దుర్గేశ్ సంచలన ఆరోపణలు చేశారు. పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ ముగ్గురూ తాడేపల్లి నుంచి వస్తున్న ఒకే స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మేధావుల ముసుగులో వీరు చేస్తున్న ప్రయత్నాలు, వైఎస్ జగన్‌తో జడా శ్రావణ్ భేటీ కావడంతో బట్టబయలయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేశ్, జడా శ్రావణ్‌ను లక్ష్యంగా చేసుకుని పలు సూటి ప్రశ్నలు సంధించారు. "జగన్‌పై పోరాటానికి రూ. 25 కోట్లు సొంత డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పిన శ్రావణ్‌కు అంత సొమ్ము ఎలా వచ్చిందో చెప్పాలి. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆయన, తక్కువ కాలం జడ్జిగా పనిచేసి, తర్వాత సాధారణ న్యాయవాదిగా ఉన్నారు. అలాంటి వ్యక్తికి అంత డబ్బు ఎలా వస్తుంది? మాకు తెలిసిన సమాచారం ప్రకారం, అవినీతి కేసుల్లో ఉండటం వల్లే ఆయన జడ్జి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అలాగే, సుగాలి ప్రీతి తల్లిని మోసం చేసిన మాట వాస్తవం కాదా?" అని దుర్గేశ్ నిలదీశారు. జోసెఫ్ రావణ్, శ్రావణ్, ప్రకాశ్ రాజ్‌ల మధ్య ఉన్న 'క్యాష్ బంధం' ఏంటో బయటపెట్టాలని దుర్గేశ్ డిమాండ్ చేశారు. "రావణ్‌ను అరెస్ట్ చేస్తే శ్రావణ్ ఎందుకు అంతగా ఇబ్బంది పడుతున్నారు? ప్రశ్నించే హక్కు అంటే బూతులు తిట్టడమేనా? వ్యక్తిత్వ హననం చేసేవారిని వెనకేసుకు రావడమేనా మీ పని?" అని ప్రశ్నించారు. ఈ ముగ్గురూ కలిసి ఏపీలో క్రైస్తవులను రెచ్చగొట్టి మతాల మధ్య ఘర్షణలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీని వెనుక వైసీపీ ఎజెండా స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు.

## మాట తప్పుడు.. పార్టీలు మారడం నీ సంస్కృతి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రం సంగతి పక్కన పెడితే, ముఖ్యమంత్రి సభ నిర్వహించిన ఖమ్మం జిల్లాలో అయినా రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందా అని నిలదీశారు. ఒకవైపు చివరి ఏడాదిలో రాజకీయాలు చేద్దామంటూ, మరోవైపు ప్రతి సభలో అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం ఖమ్మం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా హరీశ్‌రావు ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ప్రస్తు తం లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా పంపులను ఆన్ చేయకుండా నీటిని దిగువకు వదిలేయడం తెలంగాణ రైతాంగంపై నమ్మక ద్రోహమేనని హరీశ్‌రావు ఆరోపించారు. రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉన్న పంపులు సిద్ధంగా ఉన్నా, ప్రభుత్వం కావాలనే వినియోగించడం లేదన్నా రు. కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసి అన్నారం, సుందిళ్ల మీదుగా ఎల్లంపల్లికి తరలించాలని రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి, మిషన్ భగీరథ, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు పెద్దఎత్తున నీరు అవసరమవుతుందని, ఆ పరిస్థితిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు హెచ్చరికలు వస్తున్న సమయంలో లభ్యమవుతున్న ప్రతి చుక్క నీటిని ఒడిసిపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా, వాటిని వినియోగించకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలేయడం జలద్రోహమేనని హరీశ్‌రావు ఆరోపించారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకంలో 24 మోటార్లు నిరంతరాయంగా పనిచేస్తూ ఇప్పటికే 60 టీఎంసీలకు పైగా నీటిని వినియోగించుకుంటుంటే, తెలంగాణలో సిద్ధంగా ఉన్న బాహుబలి పంపులను ఆన్ చేయకపోవడం వెనుక చీకటి ఒప్పందం ఏమిటని ప్రశ్నించారు.

## ఏపీలో పెట్టుబడులకు కొరియా సంస్థల సానుకూలత..

ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, సియోల్‌లో ప్రముఖ ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ సంస్థలైన మోటివ్‌లింక్, షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ యాజమాన్యాలతో ఆయన కీలక సమావేశాలు నిర్వహించారు. ఏపీలో తయారీ యూనిట్లు స్థాపించి, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో భాగస్వాములు కావాలని వారిని ఆహ్వానించారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల (పీసీబీ) తయారీలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన షిన్‌హ్యూప్ ఎలక్ట్రానిక్స్ ఛైర్మన్ టేహూ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. తిరుపతి జిల్లా నాయుడుపేటలో రూ.1,595 కోట్ల భారీ పెట్టుబడితో తమ సంస్థ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ఈ సందర్భంగా టేహూ కిమ్ ప్రకటించారు. ఈవీ/ఆటో, హెల్త్‌కేర్, స్మార్ట్ మీటరింగ్ రంగాలకు అవసరమైన పీసీబీలు, సీసీఎల్, ఈఎంఎస్‌లను ఇక్కడ తయారు చేయనున్నట్లు తెలిపారు.

## ఇరాన్‌పై అనుమానాస్పద దాడులు

దుబాయ్: ఇరాన్‌పై వరుసగా వైమానిక దాడులు జరగడం తీవ్ర కలకలం సృష్టించింది. తాము దాడులు పూర్తిస్థాయిలో నిలిపివేశామని అమెరికా ప్రకటించిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. తాజా అనుమానాస్పద దాడులతో తమకు సంబంధం లేదని అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్నది ఎవరన్నది అంతుబట్టడం లేదు. దివంగత సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీని ఖననం చేయడానికి ఇరాన్ సన్నద్ధమవుతున్న తరుణంలోనే గురువారం దక్షిణ ఇరాన్‌లోని వివిధ ప్రాంతాల్లో వైమానిక దాడులు జరిగాయి. దీనికి కారణం ఎవరన్న దానిపై ఇరాన్ కూడా ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా సాగిస్తున్న ప్రచారానికి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) మద్దతు ఇస్తోందంటూ ఇరాన్ చట్టసభ సభ్యుడు ఒకరు ఆరోపించారు. అమెరికాకు సహకరించినందుకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇటీవల అమెరికా చేసిన దాడుల్లో యూఏఈ తెర వెనుక పాత్ర పోషించిందని మండిపడ్డారు. ఇరాన్‌పై తాజా వైమానిక దాడుల పట్ల గల్ఫ్ దేశాలు కూడా స్పందించలేదు. ఇరాన్ బద్ధశత్రువైన ఇజ్రాయెల్ కూడా మౌనం వహించింది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు కీలక జలమార్గమైన హార్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, నౌకల రవాణాకు వీలు కల్పించాలని అమెరికా పట్టుబడుతున్న తరుణంలో ఇరాన్‌పై వరుసగా దాడులు జరిగాయి.

# జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**చౌటుప్పల్, జులై 10, క్రైమ్ మిర్రర్:** జాతీయ నూలిపురుగుల నిర్మూలన దినోత్సవం ఈనెల 13 వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని కావున తల్లితండ్రులు 1-19 సంవత్సరాల పిల్లలకు తప్పకుండ ఆల్బెండాజోలు టాబ్లెట్స్ వేయించాలని చౌటుప్పల్ మండలం వైద్యాధికారి సిహెచ్ కాటంరాజు కోరారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తంగడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్. కాటం రాజు ప్రాథమిక మరియు జిల్లా పరిషత్ స్కూల్స్ టీచర్స్, ఐసిడిఎస్ సూపెర్వైసోర్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈనెల 13వ తేదీ సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్క విద్యార్థికి ఆల్బెండాజోలు మాత్రలు వెయ్యాలని, ఒకవేళ ఏదైనా కారణం చేత విద్యార్థులు ఆ రోజు వేసుకోక పోతే మళ్ళీ 20 వ తేది సోమవారం రెండవ రౌండ్ లో మిగిలిన పిల్లలకు వేయించాలని కోరారు. ఈ



కార్యక్రమంలొ ప్రతి ఒక్కరు బాధ్యతగా పాల్గొని వారి వారి పిల్లలకు ఆల్బెండాజోలు టాబ్లెట్స్ వేయించి పిల్లలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

# సరూర్‌నగర్ సబ్ పోస్టాఫీసులో ప్రజల అవస్థలు..

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ సరూర్‌నగర్:** సారూర్‌నగర్ సబ్ పోస్టాఫీసులో గత రెండు రోజులుగా ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పీడ్ పోస్టు, రిజిస్టర్డ్ పోస్టు, మనీ ఆర్డర్, పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ లావాదేవీలు, ఆధార్ సేవలు, ఇతర ఆన్‌లైన్ పోస్టల్ సేవలు నిలిచిపోవడంతో పనుల కోసం వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. రోజువారీగా వందలాది మంది పోస్టాఫీసుకు వివిధ అవసరాల కోసం వస్తుండగా, ఇంటర్నెట్ సమస్య కారణంగా సేవలు అందక విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా కోర్టు, విద్య, ఉద్యోగాలకు సంబంధించిన అత్యవసర రిజిస్టర్డ్



పోస్టులు, స్పీడ్ పోస్టులు పంపాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై సిబ్బందిని ప్రశ్నిస్తే, "ఇంటర్నెట్ సాంకేతిక సమస్య కారణంగా సేవలు నిలిచిపోయాయి" అని చెబుతున్నప్పటికీ, రెండు రోజులుగా సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో పోస్టాఫీసుకు వచ్చిన వారు పనులు పూర్తి కాక వెనుదిరుగుతున్నారు.

**ప్రజల డిమాండ్..**

సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇంటర్నెట్ సమస్యను పరిష్కరించి పోస్టల్ సేవలను పునరుద్ధరించాలని, భవిష్యత్తులో ఇలాంటి అంతరాయాలు రాకుండా ప్రత్యామ్నాయ ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ సమస్యతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్న నేపథ్యంలో అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలంటూ ఆర్టీసీ అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి

**హైదరాబాద్(క్రైమ్ మిర్రర్) :** జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవీ లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ఛైర్మెన్ వై.నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణ లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర



వ్యాప్తంగా(తెలంగాణ ఎర్త్ వైడ్) ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# హిందూ అమ్మాయిల గల్లంతు

**సర్ ప్రక్రియ, రోహింగ్యాల అంశాలపై సిపికి వినతిపత్రం అందజేసిన శ్రీరాములు అందెల**

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్)** మహేశ్వరం నియోజకవర్గంలో సర్ ప్రక్రియ, అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలు మరియు నియోజకవర్గ వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో హిందూ అమ్మాయిల గల్లంత కేసుల అంశాలపై రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్, భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షులు నిరంజన్ యాదవ్ తో కలిసి మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు హైదరాబాద్ సిపి సజ్జనర్ ని బంజారాహిల్స్ లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లో కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ సమస్యాత్మక బూత్‌లలో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో భాగంగా బీఎల్ఓలు, బీఎల్ఏలకు తగిన భద్రత కల్పించి ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాల స్థావరాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని సీపీకి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గంలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో హిందూ యువతుల గల్లంతుకు సంబంధించి కేసులు నమోదయ్యాయని, ఈ కేసులపై వేగవంతమైన మరియు సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని సీపీని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేందర్ రెడ్డి, బిజెపి మరియు బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# సఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** ూమహేశ్వరం నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీరస్తు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన సదస్సు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇమిగ్రేషన్ ఫారాలు, ఓటరు జాబితా ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి దశను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐచ్చితం శ్రీధర్, పట్లోళ్ల కౌశిక్ రెడ్డి, జిల్లేల కృష్ణారెడ్డి, మురుకుంట్ల అరవింద్, అర్కల భూపాల్ రెడ్డి, నాగేష్, అర్కల కామేష్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయే : కోలను శంకర్ రెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని రాజకీయ కుట్రలు పన్నినా తెలంగాణలో భారతీయ జనతా పార్టీ విజయాన్ని అడ్డుకోలేవని బీజేపీ రాష్ట్ర సహకార విభాగం కన్వీనర్ కోలన్ శంకర్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అప్పులు, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని ఆరోపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తోందని కొనియాడారు. ప్రజల విశ్వాసం బీజేపీపైనే ఉందని, రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం అన్నారు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతోందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలకు కాలం చెల్లిందని కోలన్ శంకర్ రెడ్డి అన్నారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను పరిశీలించిన ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్



**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి:** భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా శంకర్‌పల్లి మండలంలోని కొండకల్, చెందిప గ్రామాల్లో ఏర్పాటు చేసిన బీఎల్‌వో కేంద్రాలను శంకర్‌పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ సందర్శించి ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు, పేర్ల చేర్పు, తొలగింపు, సవరణల ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించిన ఎంపీడీవో, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించేలా నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. అలాగే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు, ఎంపీఓ, ఏపీవో మరియు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ అధికారులు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.


# ప్రతి అర్హత కలిగినఓటరుకు ఏనుమరేషన్ ఫారాలు వెంటనే అందించాలి టి. రామకృష్ణ....



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి అర్హ ఓటరుకు ఏనుమరేషన్ ఫారాలను బీఎల్ఓలు త్వరితగతిన అందించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు అత్యంత విలువైనదని, కేవలం నిర్లక్ష్యం వల్ల ఒక్క నిజమైన ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి మిస్ కాకూడదని ఆయన అన్నారు. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేసి ప్రతి కుటుంబాన్ని స్వయంగా కలుసుకుని ఏనుమరేషన్ ఫారాలను అందించి, వాటి గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, కార్మికులు, విద్యార్థులు, అద్దె ఇళ్లలో నివసించే వారు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత ఒక్కరూ ఈ ప్రక్రియకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి అర్హ ఓటరుకు ఓటు హక్కు కల్పించడమే ప్రధాన బాధ్యత అని పేర్కొన్న టి. రామకృష్ణ, ఎన్నికల అధికారులు కూడా ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించి ఎలాంటి లోపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంగారెడ్డిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో నియామకాల జోరు



**గడ్డం సుధాకర్‌కు జిల్లా ఉపాధ్యక్ష బాధ్యతలు**

**గూడెపు నరేష్ మునిపల్లి మండల అధ్యక్షుడిగా నియామకం**

**సమరభేరి విజయానికి కార్యకర్తలకు పార్టీ కృతజ్ఞతలు**

**గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి పిలుపు**

**రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 10:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో గురువారం కొత్త బాధ్యతల నియామక కార్యక్రమంతో పాటు ప్రెస్‌మీట్ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురికి పార్టీ బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా గడ్డం సుధాకర్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా, గూడెపు నరేష్‌ను మునిపల్లి మండల అధ్యక్షుడిగా నియమించి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ మాట్లాడుతూ.. భువనగిరిలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో నిర్వహించిన "సమరభేరి" సభను విజయవంతం చేసిన సంగారెడ్డి జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారం, అంకితభావం వల్లే సభ ఘనవిజయం సాధించిందని పేర్కొన్నారు. అలాగే, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ అధ్యక్షుడు నవాజ్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షుడు రవి, సదాశివపేట మండల అధ్యక్షుడు గుంజారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



## మంచిర్యాలలో 'ప్రపంచ జనాభా దినోత్సవ' పోస్టర్ల ఆవిష్కరణ

**మంచిర్యాల జూలై 10 (క్రైమ్ మిర్రర్) :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా జూలై 11 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక వైద్య ఆరోగ్య అవగాహన వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. శుక్రవారం మంచిర్యాలలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రికలు, బ్యానర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల పరిధిలో వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. 'చిన్న కుటుంబం-చింతలు లేని కుటుంబం', 'పిల్లల మధ్య సరైన అంతరం ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది' అనే నినాదాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. అన్ని పీహెచ్సీల్లో తాత్కాలిక, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేకంగా ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మహిళలకు నోటి మాత్రలు, అంతర ఇంజక్షన్, మాల, ఛాయా, ఈజీ పిన్, ఐయూసీడీ పద్ధతులు.. పురుషులకు నిరోధ్ వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా శాశ్వత పద్ధతులైన పురుషులకు వ్యాసెక్టమీ, స్త్రీలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లపై ప్రజలను చైతన్యపరచాలని కోరారు. కుటుంబ నియంత్రణ పాటించడం ద్వారానే దంపతులు ఆనందకర దాంపత్యాన్ని ఆస్వాదిస్తూ, పిల్లలను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దగలరని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రికలను ఇప్పటికే అన్ని పీహెచ్సీలకు పంపినట్లు వెల్లడించారు. శనివారం (జూలై 11) నుంచి ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అశోక్, డాక్టర్ తబియా, ఎంసీహెచ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్, డీపీహెచ్ఎన్ ఆర్.ఎస్.పద్మ, సీహెచ్ఓలు కాకిరాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, నాందేవ్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.


## ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని...

ప్రభుత్వ ఆసుపత్రిలో నిరసన కార్యక్రమం




**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ మరియు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్, డివివీపి, డిఎస్ హెచ్ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వైద్య విధాన, పరిషత్ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ కు రెగ్యులర్ కమిషనర్ డైరెక్టర్ ను నియమించాలని డిమాండ్ చేశారు. సాధారణ బదిలీల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించి పెండింగ్ బిల్లులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంతోపాటు వివిధ కేడర్ల ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పూర్తి చేయాలని కోరారు. కొత్తగా ఏర్పడిన ఆసుపత్రులకు తగిన సిబ్బందిని మంజూరు చేయాలని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులను ముందుగానే జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా నిరసనకారులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా. శివరామ్, డా. రోహిత్, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి, హెడ్ నర్స్ ఉమా, వెంకటస్వామి, శిరీష, భారతి, కావ్య, రహీమ్, కిరణ్మయి, ఫ్లోరా, శ్రీకాంత్, సునీత, అబ్బాస్, నర్సింగ్ సిబ్బంది,రమేష్ అలాగే శానిటేషన్ సిబ్బందికి చెందిన తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## ఎంజేపీటీ పాఠశాల,కళాశాలను ఆకస్మిక తనిఖీ చేసిన సెక్రెటరీ



**చౌటుప్పల్, జులై 10, క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి జిల్లా, చౌటుప్పల్ మండలం, తూప్రాన్ పేట గ్రామ పరిధిలోని ఎంజేపీటీ ముషీరాబాద్, చార్మినార్ బాలుర పాఠశాల, కళాశాలను శుక్రవారం మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు సందర్శించారు. విద్యార్థుల వసతి గృహాన్ని, స్టోర్ రూమ్ లోని నిత్యవసర సరుకులను,వంటశాలను, విద్యార్థులు తరగతి గదులను పరిశీలించారు.నూతన విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియను ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు.పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటంతో పాటు, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్ కు,సిబ్బందికి సూచించారు.

# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

-స్థానిక సంస్థలకు కలెక్టర్ భాస్కర్ రావు



**యాదాద్రి జిల్లా,జూలై 10,క్రైమ్ మిర్రర్ :** జూలై 13, 2026న నిర్వహించే నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. జూలై 13, 2026న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. జిల్లాలోని 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 1,43,614 మంది పిల్లలు, యువతకు అల్బెండజోల్ మాత్రలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 13న కార్యక్రమానికి హాజరు కాలేని వారికి జూలై 20న మాప్-అప్ డే నిర్వహించి తప్పనిసరిగా మాత్రలు అందించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కార్మిక గృహాలు, అనాథ శరణాలయాలు, అలాగే పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించి ప్రతి అర్హత కలిగిన బాలబాలికకు అల్బెండజోల్ మాత్ర అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, కడుపు నొప్పి, ఎదుగుదల మందగించడం, చదువుపై ఏకాగ్రత తగ్గడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా ఈ సమస్యలను నివారించవచ్చని వివరించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, మరుగుదొడ్లను వినియోగించడం, భోజనం ముందు మరియు మరుగుదొడ్డికి వెళ్లిన తర్వాత చేతులను సబ్బుతో కడుక్కోవడం, గోర్లు శుభ్రంగా ఉంచుకోవడం, పాదరక్షలు ధరించడం, పరిశుభ్రమైన నీరు తాగడం, ఆహారాన్ని కప్పి ఉంచడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య, విద్య, మహిళా మరియు శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ ప్రతి పిల్లవాడికి మాత్ర అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అల్బెండజోల్ మాత్రలను భోజనం చేసిన తర్వాత మాత్రమే ఇవ్వాలని, వయస్సుకు అనుగుణంగా నిర్దేశించిన మోతాదులోనే పంపిణీ చేయాలని, కార్యక్రమం సందర్భంగా అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం. మనోహర్, జిల్లా విద్యాశాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులు, వైద్యాధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఓటర్ల డిజిటలైజ్ ప్రక్రియను వేగవంతం చేయాలి







**యాదాద్రి జిల్లా,జూలై 10, క్రైమ్ మిర్రర్ :** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నుండి అర్హత కలిగిన ప్రతి భారత పౌరుడు, ఆయా నియోజకవర్గంలో సాధారణ నివాసితులు, చట్టపరంగా అనర్హులు కాని వారు ఓటరుగా నమోదు కావచ్చని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, దేశ వ్యాప్తంగా గతంలో కూడా పలు మార్లు ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా జిల్లా ఎన్నికల అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1 వేయి 200 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ 99.6 శాతం, డిజిటైజేషన్ ప్రక్రియ 21.94 శాతం పూర్తి అయ్యాయని, మిగిలిన ఫారాలు నేడు పంపిణీ పూర్తి చేసి డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ... భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, ఎలక్షన్ సెల్ సూపర్ డెండెంట్, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్డేట్ ను వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి జిల్లా,జులై 10,క్రైమ్ మిర్రర్ :** జిల్లాలో ఆధార్ నమోదు, ఆధార్ అప్డేషన్, బయోమెట్రిక్ అప్డేట్ ప్రక్రియలను వేగవంతం చేసి ప్రతి అర్హుడికి ఆధార్ సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి, ఆధార్ సేవల పురోగతి, చిన్నారుల ఆధార్ నమోదు, విద్యార్థుల బయోమెట్రిక్ అప్డేట్ ఆధార్ వెరిఫికేషన్ పెండింగ్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆసుపత్రుల్లో వ్యాక్సినేషన్ సమయంలోనే ఆధార్ నమోదు జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ, పోస్టల్ శాఖల సమన్వయంతో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. 5 నుండి సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్ ఉచితంగా అందుబాటులో ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్డేట్ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. 18 సంవత్సరాలు పైబడిన వారి ఆధార్ నమోదు వెరిఫికేషన్ పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, జిల్లాలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విద్యా ప్రవేశ పరీక్షలు, ఇతర సేవల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలు తమ ఆధార్ నమోదు, అప్డేట్ ప్రక్రియలను ముందుగానే పూర్తి చేసుకునేలా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అక్షాంశ్ యాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకా రెడ్డి, యూఐడీఏఐ హైదరాబాద్ ఆర్వో నరేష్ చంద్ర , ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్ సాయి కుమార్ , డీడబ్ల్యూఓ, డీఈఓ, ఎల్డీఎం, పోస్టల్ సూపరింటెండెంట్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి వేడుకల్లో పాల్గొన్న రియల్ ఎస్టేట్ బృందం



**క్రైమ్ మిర్రర్ పాలేరు ౧:** నేలకొండపల్లి గ్రామపంచాయతీలో మాజీ ఎం.పీ.టీ.సీ గుడిపాటిముక్కంటి పెళ్లి వేడుకకు నేలకొండపల్లి రియల్ ఎస్టేట్ బృందంతో నేలకొండపల్లి రియల్ ఎస్టేట్ మండల అధ్యక్షుడు తెలగొర్ల లింగస్వామి నూతన దంపతులను ఆశీర్వదించాడు. ఈ కార్యక్రమంలో మైస శంకర్ గోళ్ళబ్రదర్స్ అనంతు మరియు శ్రీనివాసరావు పోనగాని రాంభాస్కర్ కూరాకుల నాగేశ్వరావు పసుపులేటి ఉపేందర్ పొట్ట పెంజర వెంకటేశ్వర్లు బొడ్డు శ్రీనుతదితరులు పాల్గొని నూతన దంపతులను తదితరులు ఆశీర్వదించారు

## బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకుందాం....

బోనాల పండుగ ఉత్సవాల ఏర్పాట్ల నిధుల కోసం దరఖాస్తుల స్వీకరణ....

పీఏసీ చైర్మన్ ఆరెక పూడిగాంధీ.....



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరి చేసింది అని, బోనాల పండుగ ఉత్సవాల ఏర్పాట్ల నిధుల కోసం శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆయా దేవాలయాల ఆలయ ధర్మకర్తలు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని పీఏసీ చైర్మన్ గాంధీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవడానికి నిధులు మంజూరి చేయడం జరుగుతుంది అని పీ ఏ సీ చైర్మన్ గాంధీ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మనస్సు తో ఈ ఏడాది బోనాల ఉత్సవాల కోసం రూ. 20 కోట్ల నిధులు మంజూరి చేయడం జరిగినది అని, ఆలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరుగుతుంది అని, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య సదుపాయాలు వంటి అన్ని ఏర్పాట్లను సమన్వయంతో అమలు చేయడం జరుగుతుంది అని, మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ప్రతి భక్తుడు అమ్మవారి ఆశీస్సులతో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను జరుపుకునేలా అన్ని శాఖలు సమిష్టిగా పనిచేయాలని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేశారు. బోనాల పండుగ ఉత్సవాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు నిధులు మంజూరు చేస్తోందని కావున అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలిపారు. అదేవిధంగా అర్హత (రిజిస్ట్రేషన్) కలిగిన ఆలయ కమిటీలకు నిధుల కోసం దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పీ ఏ సీ చైర్మన్ గాంధీ తెలియచేశారు.

**దరఖాస్తుతో పాటు**

టెంపుల్ కమిటీ లెటర్‌ప్యాడ్, ఆలయ బ్యాంక్ ఖాతా వివరాలు, ఆలయ కమిటీ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ ఆధార్ కార్డు ప్రతులు, ఆలయానికి సంబంధించిన అమ్మవారి ఫొటోలు... ప్రతీ కాపీ పై కమిటీ స్టాంపు ముద్రించి జతపరచాలని సూచించారు. దరఖాస్తుల చివరి తేదీ 15.7.26 లోగా సమర్పించాలని ప్రకటనలో తెలిపారు.

# ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి.

- రెండున్నరేళ్ల నుండి విద్యశాఖకు మంత్రి లేకపోవడం దారుణం, వెంటనే కేటాయించాలి.
- ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల.రమేష్ డిమాండ్.
- వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ కి సంపూర్ణ మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొన ఏ.ఐ.వై.ఎఫ్ ఖమ్మం జిల్లా నేతలు.
- రఘునాథపాలెం మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం.




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్రశీలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలనీ, రెండున్నరేళ్ల నుండి విద్యశాకకు మంత్రి లేకపోవడం దారుణం అన్ని వెంటనే కేటాయించాలనీ, వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ కి ఏ.ఐ.వై.ఎఫ్ ఖమ్మం జిల్లా నేతలు సంపూర్ణ మద్దతు తెలిపి ప్రత్యక్షంగా పాల్గొన్నారనీ బంద్ విజయ వంతం అయిందని ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల. రమేష్ తెలిపారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్య సంస్థల బంద్ సందర్భంగా రఘునాదపాలెం మండలంలో ఏ.ఐ.వై.ఎఫ్, ఏ.ఐ.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తోలుత మండలంలో కోయచలక, రేగులచలక, కోటపాడు, పాపటపల్లి, చిమ్మపూడి ప్రభుత్వ ప్రైమరీ, ఉన్నత పాఠశాలతో పాటు మండలంలో పలు పాఠశాలల్లో బంద్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ.ఐ.వై.ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చింతల. రమేష్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న నేటికి విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు రాలేదని, బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బంద్ తో అయిన కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి స్పందించి విద్యారంగంలో నెలకొన్ని ఉన్న సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రశీలో ప్రభుత్వ విద్యాసంస్థలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల, అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలనీ, రెండున్నరేళ్ల నుండి విద్యశాకకు మంత్రి లేకపోవడం దారుణం అన్ని వెంటనే కేటాయించాలనీ ఆయన డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గాడిచర్ల. సత్యనారాయణ , ఏ.ఐ.వై.ఎఫ్ , ఏ.ఐ.ఎస్.ఎఫ్ మండల నాయకులు దొంతు గణేష్ ముద్రబోయిన సంజీవ్ రావు పోతనబోయిన నాగరాజు మధు షేక్ ఖాజా గొడుగు ఉమేష్ షేక్. అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో 50శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 10:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. వచ్చే సోమవారం నాటికి కనీసం 50 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ న్యూఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్లతో కలిసి ఎస్ఐఆర్ అమలుపై సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, మున్సిపల్ కమిషనర్లతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లాలోని పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్ల నుంచి అందిన ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, వాటి డిజిటలైజేషన్‌లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ అమలులో అలసత్వం వహిస్తే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. శని, ఆదివారాల్లో కూడా ప్రత్యేకంగా పనిచేసి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి బీఎల్ఓకు రోజువారీ లక్ష్యాలు నిర్దేశించాలని ఆదేశించారు. ఏఈఆర్‌వోలు, ఈఆర్‌వోలు పోలింగ్ స్టేషన్ వారీగా ప్రతిరోజూ సమీక్ష నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో బీఎల్ఓల పనితీరును పర్యవేక్షించాలని సూచించారు. ఓటర్లు పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేసి రోజువారీ ప్రగతి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు బీఎల్ఓలకు సహకరించి ఓటర్లకు ఫారాల పూరణలో అవసరమైన సహాయం అందించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు కూడా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బీఎల్ఓలకు పూర్తి సహకారం అందించాలని, ఓటర్లు పూరించిన ఫారాలు సకాలంలో బీఎల్ఓలకు చేరేలా సమన్వయం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంగీత, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత షి టీమ్ బాధ్యత

**షీ టీమ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని సిబీఎం కళాశాల లో షీ టీమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఆదేశాల మేరకు మహిళల రక్షణ కోసం వారు పాటించాల్సిన జాగ్రత్తలు సూచనలు కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా సి సి ఎస్ ఇన్స్పెక్టర్ శంకర్ మాట్లాడుతూ.. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా మరియు వినియోగం వలన భవిష్యత్తులో యువత ప్రమాదంలో పడుతుందని, మత్తు పదార్థాల బారిన పడి ఎంతోమంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని హెచ్చరించారు. కొంతమంది యువత జల్సా జీవితంతో పాటు సులభంగా డబ్బు సంపాదన కోసం అక్రమ మార్గంలో గంజాయితో పాటు ఇతర డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను విక్రయిస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాంటి నేరస్తులతో పాటు, మత్తు పదార్థాలను వినియోగించే వ్యక్తులకు చట్టపరమైన శిక్షలు తప్పవని అన్నారు. అదేవిధంగా షీ టీమ్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలు, బాలికల భద్రత కోసం తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం అని గుర్తు చేశారు. మహిళలపై జరిగే ఈవ్ టీజింగ్, వేధింపులు, స్టాకింగ్, సైబర్ వేధింపులు వంటి నేరాలను నివారించడం దీని ప్రధాన లక్ష్యం అని చెప్పారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఫిర్యాదులను స్వీకరించడం, బాధితులకు కౌన్సెలింగ్ అందించడం, అవసరమైనప్పుడు చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మహిళల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తుంది. సమాజంలో మహిళలు నిర్భయంగా జీవించేందుకు షీ టీమ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. బాలబాలికలు చదువుపై దృష్టి పెట్టి, విలువలతో కూడిన జీవనవిధానంతో, క్రమశిక్షణతో కృషి చేయడం వలన ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని విద్యార్థులకు సూచించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం సభ్యులు ఆటపాటలతో వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు అమ్మకాల సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ కు గానీ, లేదా 1908 కి సమాచారం ఇవ్వగలరని చెప్పారు. ఏ విధంగా సైబర్ క్రైమ్ నేరాల పట్ల పలు సూచనలు చేశారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరానికి గురైనట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి లేదా సంబంధిత పోలీసు స్టేషన్ కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాల్య వివాహాల వలన అనేక అనర్థాలు జరుగుతున్నాయని, ఎవరూ బాల్య వివాహాలు చేసుకోవద్దని, ఎవరైనా అలా చేయాలని ప్రయత్నించి నచో చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్-1098 కు ఫోన్ చేయాలని కోరారు. అలాగే యువత సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మైనర్లు, లైసెన్సు లేనివారు, మద్యం తాగినవారు ఎలాంటి వాహనం నడపకూడదని, రోడ్డు ప్రమాదాల వలన అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని వాటిని నివారించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రకరకాల పద్ధతులలో మాయమాటలు చెప్పి పిల్లలను, అమ్మాయిలను, యువతను, మహిళలను అక్రమ రవాణా చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని, అలాంటి అనుమానితులు ఉంటే వెంటనే సంబంధిత పోలీసులకు 8712657745 కు డయల్-100 లేదా ఎగాజు ఎజూగావీ చీః; 8712657676 కు ఫోన్ చేసి తెలియజేయాలని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సిసిఎస్ ఇన్స్పెక్టర్ శంకర్, కల్వకుర్తి సీఐ భీమ్ కుమార్, ఎస్సై కురుమూర్తి, షి టీమ్ ఇంచార్జీ విజయలక్ష్మి సాయి, షి టీమ్ సభ్యులు హెడ్ కానిస్టేబుల్ లు వెంకటయ్య, వెంకటస్వామి, పద్మావతి, వెంకటేష్ నాయక్, జానకిరాములు, వెంకట్రాములు, గోపాల్, కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పటాన్‌చెరు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వెంటనే ప్రారంభించాలి: సీపీఎం

**రూ.200 కోట్ల ఆస్పత్రి ప్రారంభంలో జాప్యంపై సీపీఎం ఆగ్రహం**
**ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వానికి డిమాండ్**
**ప్రారంభించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని కె. రాజయ్య హెచ్చరిక**

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 10:** పటాన్‌చెరులో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రభుత్వం వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కే. రాజయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆస్పత్రిని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, భవనం నిర్మాణం పూర్తై ఏడాదికి పైగా గడిచినా ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. పటాన్‌చెరు పరిశ్రమల ప్రాంతం కావడంతో పాటు జాతీయ రహదారి ఉండటంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని, అత్యవసర వైద్యం కోసం బాధితులను హైదరాబాద్‌కు తరలించాల్సి వస్తోందని పేర్కొన్నారు. సిగాచి పరిశ్రమ ప్రమాదం వంటి ఘటనలు ఈ ప్రాంతంలో అత్యాధునిక వైద్యసేవల అవసరాన్ని స్పష్టం చేశాయని అన్నారు. జిల్లాకు వైద్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ ఆస్పత్రి ప్రారంభంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించిన రాజయ్య, తక్షణమే ఆస్పత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి ప్రారంభమయ్యే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

# నేరేడుచర్ల మండల ఎస్ఐ గా గోపాల్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం నూతన ఎస్ఐ గా చలమల్ల గోపాల్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కోదాడ రూరల్ పరిధిలో విధులు నిర్వహించిన అతను నేరేడుచర్ల ఎస్ఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు .ఇక్కడ పనిచేసిన సైదిరెడ్డి సూర్యాపేట సిసిఎస్ కు బదిలీ అయ్యారు . బాధ్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ శాంతి భద్రత పరిరక్షణకు కట్టుబడి పని చేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు ,అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం తెలిపారు.

# రాజ్యాధికార సమర భేరి విజయంతో పార్టీకి నూతన ఉత్సాహం

**కార్యకర్తలకు నాయకుల అభినందనలు**



**క్రైమ్ మిర్రర్ చేవెళ్ల:** భువనగిరిలో నిర్వహించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ లిలి"రాజ్యాధికార సమర భేరి" మహాసభ విజయవంతం కావడం పట్ల రంగారెడ్డి జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం చేవెళ్లలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ముద్దెంగూడెం జనార్ధన్ ముదిరాజ్, చేవెళ్ల మండల అధ్యక్షుడు కూనుకుర్తి అశోక్,షాబాద్ మండల అధ్యక్షుడు కావలి శంకర్ ముదిరాజ్, పాల్గొన్నారు. సభను విజయవంతం చేయడంలో అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మల్లన్న అభిమానులు, ప్రజలకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భువనగిరి మహాసభకు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరి సహకారం పార్టీకి మరింత బలం చేకూర్చిందని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహం, ఐక్యతతో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత విస్తరించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ తెలంగాణ రాజ్యాధికార సాధన లక్ష్యంగా ముందుకు సాగుదామని నాయకులు అన్నారు.

# కాంగ్రెస్ పార్టీ తోనే పేదింటి కల నెరవేరుతుంది...!



**క్రైమ్ మిర్రర్ :కొందుర్గు :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లక్ష ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా కొందుర్గు మండలంలోని లక్ష్మీదేవునిపల్లి గ్రామంలో లబ్ధిదారులు రవి నాయక్--లక్ష్మి దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోగురి పురుషోత్తం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కోగురి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనంతరం నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారుల కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లేష్ గౌడ్, సర్పంచ్ దామోదర్, డిప్యూటీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు, జీబీ కృష్ణ, మాదారి నర్సింలు, బీఎల్‌ఏ రమేష్, జిల్లెల ప్రవీణ్, పెంటయ్య, ఈశ్వర్ జింకల, చెనమయ్య, రాంచంద్రయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఎర్రవల్లి ఉపసర్పంచ్ కుమ్మరి వేణుగోపాల్ జన్మదిన వేడుకలు

**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని ఎట్లా ఎర్రవల్లి గ్రామ ఉపసర్పంచ్ కుమ్మరి వేణుగోపాల్ జన్మదిన వేడుకలు స్థానిక పీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున హాజరై వేణుగోపాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేస్తూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న వేణుగోపాల్‌కు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానం లభించాలని ఆకాంక్షించారు. వేడుకలకు హాజరైన పలువురు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం అభిమానులతో కలిసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 శనివారం 11-7-2026

# అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అసత్య ప్రచారం.

**కోదాడ ప్రజలు అబద్ధాలను కాదు... అభివృద్ధిని నమ్ముతున్నారు.'**
**కాంగ్రెస్ పార్టీ నాయకులు**
**రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్**



కోదాడ జులై 10 ( క్రైమ్ మిర్రర్ ): కోదాడ నియోజకవర్గంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నాయకత్వంలో వేగంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పూర్తిగా అసహనానికి గురై, వరుసగా నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్ మండిపడ్డారు. బొల్లం మల్లయ్య యాదవ్ నిర్వహించిన మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని వారు స్పష్టం చేశారు. కోదాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వరుసగా నిరాధార ఆరోపణలు చేయడం దురదృష్టకరం. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించడానికి ఆధారాలు లేని విమర్శలు చేయడం ఆయన రాజకీయ సంస్కృతికి నిదర్శనం. ప్రభుత్వ భూములు, చెరువులు, మైనింగ్, ఆక్రమణలపై ఆయన చేసిన ప్రతి ఆరోపణ గత పాలనలో జరిగాయని అన్నారు. రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం.. ఎలాంటి ఆధారాలు లేకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా మాట్లాడటం మాజీ ఎమ్మెల్యే స్థాయికి ఏమాత్రం తగదన్నారు. ప్రజలు తిరస్కరించిన తర్వాత కూడా వాస్తవాలను అంగీకరించకుండా ప్రతిరోజూ కొత్త ఆరోపణలు చేయడం రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, మైనింగ్ లేదా ఇతర అంశాలపై మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలకు నిజంగా ఆధారాలు ఉంటే వాటిని ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు.

**అభివృద్ధి కనిపించడం లేదా?..**

కోదాడలో నియోజకవర్గం లో వందల కోట్ల రూపాయల నిధులతో రోడ్లు, తాగునీటి పథకాలు, గ్రామీణ అభివృద్ధి, పట్టణ మౌలిక వసతులు, విద్యా-- వైద్య రంగాల అభివృద్ధి, సాగునీటి పనులు, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అభివృద్ధిని ప్రత్యక్షంగా చూస్తుండగా, మాజీ ఎమ్మెల్యే మాత్రం అభివృద్ధి కనిపించనట్టుగా మాట్లాడటం ప్రజలను అవమానించడమేనని అన్నారు.

**ప్రజల తీర్పును గౌరవించాలి.**

ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ప్రతి అంశంలో విషప్రచారం చేయడం మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు తగదని హితవు పలికారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన నాయకుడు ఇప్పుడు సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలవాలని ప్రయత్నించడం విచారకరమని పేర్కొన్నారు.

**దుష్ప్రచారంతో అభివృద్ధిని ఆపలేరు...**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి నాయకత్వంలో కోదాడ అభివృద్ధి మరింత వేగంగా కొనసాగుతుందని, ఎలాంటి దుష్ప్రచారాలు ఆ అభివృద్ధిని అడ్డుకోలేవని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన ఆధారాలు లేని ఆరోపణల పై విరమించుకుని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారినీ, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి గారినీ, కోదాడ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్న విద్యాసంస్థలకు ఏఐఎస్ఎఫ్ అభినందనలు.....



శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన విద్యాసంస్థల బంద్‌కు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతూ బంద్‌లో పాల్గొనడం అభినందనీయమని ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి నియోజకవర్గ సమితి అధ్యక్షుడు టి. నితీష్ ధర్మ తేజ అన్నారు. విద్య హక్కును పరిరక్షించడం, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారం తగ్గించడం, విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ఈ బంద్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు విశేష సహకారం అందించారని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఈ బంద్‌ను విజయవంతం చేసిన ప్రతి విద్యాసంస్థ యాజమాన్యానికి, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్రజలకు ఏఐఎస్ఎఫ్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం జరిగే వరకు ఏఐఎస్ఎఫ్ పోరాటాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రభుత్వం వెంటనే విద్యా రంగ సమస్యలపై స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని టి. నితీష్ ధర్మ తేజ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై 143 145వ బూత్ లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు...

**పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్**



క్రైమ్ మిర్రర్ (కోరుట్ల )జూలై 10: ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై కోరుట్ల పట్టణ 143 145వ బూత్ 13వ వార్డు డాక్టర్ రాంచంద్రర్ ఇంటి దగ్గర గల అంగన్వాడీ సెంటర్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 100శాతం పూర్తి అయ్యే విధంగా బూత్ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఎల్ఓ లకు పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తున్నారు ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ అయ్యే విధంగా బూతు స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఎల్ఓ లకు పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు ఎన్యుమరేషన్ ఫారాలు 100 శాతం డిజిటలైజేషన్ అయ్యే విధంగా కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నాయకులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు అలాగే అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా తొలగించబడకుండా చూడాలన్నారు ప్రజలకు ఏ అనుమానాలు ఉన్న ఫారాలు నింపడంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే బూతు స్థాయి నాయకుల వద్దకు వెళ్తే పూర్తిస్థాయి సహాయ సహకారాలు అందిస్తారని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ 143 వ బూత్ బిఎల్ఏ ఓలెపు రాజేష్ 145వ బూత్ బిఎల్ఏ కొండ్ర నరహరి వార్డు ఆఫీసర్ అంగన్వాడీ ఆర్పీ ఆశాలు స్థానిక వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇస్నాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ ఢీకొని మహిళ మృతి



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 10: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్నాపూర్ చౌరస్తా సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్తతో పాటు ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రేగోడు మండలం కొత్వాన్‌పల్లి గ్రామానికి చెందిన వీరొల్ల గోపాల్ (36) తన భార్య ప్రవల్లిక (32), పిల్లలు నక్షత్ర, ప్రిన్స్‌తో కలిసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చిన కుటుంబ సభ్యులు పనులు ముగించుకుని శుక్రవారం టీఎస్--09--టీఎస్--4290 నంబర్ గల స్కూటీపై హైదరాబాద్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో ఇస్నాపూర్ చౌరస్తా సమీపంలోని ఐసీఐసీఐ బ్యాంక్ వద్దకు చేరుకోగా, వెనుక నుంచి మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్ వీఐ 46 దీదీ 0793 గల ట్రైలర్ లారీ అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. ఢీకొట్టడంతో భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు రోడ్డుపై పడిపోయారు. ఈ క్రమంలో లారీ చక్రం ప్రవల్లికపై నుంచి వెళ్లడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను వెంటనే పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ప్రవల్లిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గోపాల్‌తో పాటు చిన్నారులు నక్షత్ర, ప్రిన్స్‌కు గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ వినోద్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఖమ్మంలో ప్రమీల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం



క్రైమ్ మిర్రర్ ఖమ్మం, జులై10: ఖమ్మం స్థానిక నెహ్రూ నగర్ ప్రాంతంలో పాత భద్రాద్రి బ్యాంక్ కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రమీల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను శుక్రవారం భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకురి క్రిష్ణ మూర్తి ప్రారంభించారు. ఈ హాస్పత్రిలో జనరల్ వైద్య సేవలతో పాటు న్యూరో సైకియాట్రీ, డెర్మటాలజీ, ఈఎన్ టీ, డెంటల్, ఓఎంఎఫ్ఎస్, క్రిటికల్ కేర్, వంటి ప్రత్యేక సదుపాయాలతో 24 గంటల పాటు సేవలందించడానికి ఆస్పత్రిని ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. జనరల్ వార్డు, స్పెషల్ రూమ్స్, ఐసీయూ, ల్యాబ్ తో పాటు అంబులెన్స్ సర్వ సన్నదంగా వ్యాదిగ్రస్తులకు సత్వరం వైద్య సేవలకు సిద్ధంగా ఉంచామని ఆస్పత్రి యాజమాన్యం పిట్టల శ్రీకాంత్ రాజ తెలిపారు. ప్రమీల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభోత్సవ డాక్టర్ కన్నెగంటి శివరామక్రిష్ణ (ఎండీ జనరల్ మెడిసిన్), డాక్టర్ మోపర్తి సురేష్ బాబు (ఎండీ పీడియార్టిక్), డాక్టర్ పరుచురి వెంకటేశ్వర రావు (ఎండీఎస్), డాక్టర్ జంగాల సునిల్ కుమార్ (డీఎం గ్యాస్ట్రో), డాక్టర్ కె.స్వర్ణ కుమారి (డీజీఓ), డాక్టర్ భరత్ బాబు (ఎండీ జనరల్ మెడిసిన్), డాక్టర్ కె. రవికుమార్ ,డాక్టర్ రమేష్ రెడ్డి ఆలంపాటి(ఎండి జనరల్ మెడిసిన్), డాక్టర్ వరుణ్ జొన్నలగడ్డ (ఎంఎస్ న్యూరో సర్జన్) లతోపాటు పలువురు జూనియర్ డాక్టర్లు వివిధ ఆస్పత్రుల యాజమాన్యాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టల నాగేశ్వరరావు ఆస్పత్రి మెనేజ్ మెంట్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మంచిగా వైద్య సేవలను అందించి, ప్రజల మన్ననలు పొందాలని కోరారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అభిలాష్ రెడ్డి, కీర్తి ప్రవళికాను శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్వాతీ ఆస్పత్రి మేనేజ్ మెంట్ లక్ష్మణ్ రావు, స్పర్శ ఆస్పత్రి మేనేజ్ మెంట్ భాస్కర్ రెడ్డి, శశి ఆస్పత్రి మేనేజ్ మెంట్ శ్రీను, క్యూర్ ఆస్పత్రి మేనేజ్ మెంట్ వాసు, నందన ఆస్పత్రి మేనేజ్ మెంట్ పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస ఆస్పత్రి మేనేజ్ మెంట్ వెంకన్న, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ వెంకటా చారీ, ఉపాధ్యక్షుడు వెంకట రామయ్య, కార్యదర్శులు టీ.రాము, శ్రీనివాస రావు, బీ.వెంకటేశ్వర్లు, టి శ్రీనివాస రావు, ఆర్ఎంపీ డబ్లుఏ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొండల రావు, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కొమరయ్య, మైనార్టీ జిల్లా గౌరవ అధ్యక్షుడు హస్సన్, లంబాడీ హక్కుల పోరాట సమితీ రాష్ట్ర అధ్యక్షుడు బాణోత్ భద్రు నాయక్, గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రూరల్ మండల అధ్యక్షులు పి.భాస్కర్, తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు నారాయణ, కూసుమంచి మండల అధ్యక్షులు యాదగిరి, ముదిగొండ మండల అధ్యక్షులు ఉపేందర్, చింతకాని మండల కార్యదర్శి నాగేశ్వరరావు, కొణిజర్ల మండల అధ్యక్షులు రామారావు, అర్బన్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కాంపెల్లి మండల అధ్యక్షులు దుస్సా మనోహర్, కారేపల్లి మండల అధ్యక్షులు వీరయ్య చౌదరి, ఇల్లెందు మండల అధ్యక్షులు మల్లిఖార్జున్, ఏన్కూరు మండల సెక్రెటరీ మధు, తల్లాడ మండల అధ్యక్షులు పాషా, కురవి మండల అధ్యక్షులు సురేందర్, సీరోలు మండల అధ్యక్షులుశ్రీనివాస్, మరిపెడ మండల అధ్యక్షులు మురళి, నెల్లికుదురు మండల అధ్యక్షులు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో ప్రతి రైతుకూ మ్యాప్‌తో కూడిన 'భూదార్'!

- 'భూభారతి'తో సరికొత్త భూ విప్లవం.. చింతకాని సభలో మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- ముల్లుమాడ్ రైతులకు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి చేతుల మీదుగా రికార్డుల పంపిణీ
- రెండేళ్లలోనే 71 వేల ఉద్యోగాల భర్తీ.. త్వరలోనే మరో 20 వేల నోటిఫికేషన్లు
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.63 వేల కోట్లు.. ప్రతిపక్షాల అబద్ధాల ప్రచారాలపై మంత్రి పొంగులేటి ఫైర్

జు+ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: భూభారతి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి భూమినీ సర్వే చేసి, సాగులో ఉన్న ప్రతి రైతుకు మ్యాప్‌తో కూడిన 'భూదార్' కార్డును అందజేస్తాం అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. చింతకాని మండలం జగన్నాథపురం వద్ద రాష్ట్ర రైతాంగానికి రూ.9 వేల కోట్ల 'రైతు భరోసా' నిధులను జమ చేసిన సందర్భంగా నిర్వహించిన చారిత్రాత్మక 'రైతు ఆశీర్వాద సభ'లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ , పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ వేదికపై మంత్రి పొంగులేటి భూ సంస్కరణలతో పాటు ప్రభుత్వ ప్రగతిని వివరించారు.

**ముల్లుమాడ్‌లో పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్!**

ఇప్పటికే ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూభారతి పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద మధిర నియోజకవర్గంలోని ముల్లుమాడ్ రెవెన్యూ గ్రామంలో సర్వే పూర్తి చేసి, సుమారు 476 మంది రైతులకు మ్యాప్‌లతో కూడిన భూదార్ కార్డులను సిద్ధం చేశామన్నారు. ఈ సభా వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా రైతులకు ఈ కార్డులను పంపిణీ చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఇదే పద్ధతిలో కార్డులు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

**నిరుద్యోగులకు వరం... మహిళలకు అండ!**

ఈ రెండున్నర ఏళ్లలోనే సుమారు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో మహిళా సంఘాలకు రూ.63 వేల కోట్లను సున్నా వడ్డీకే అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని మంత్రి కొనియాడారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు మొదటి రెండేళ్లలోనే రికార్డు స్థాయిలో 71 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, రాబోయే కొద్ది రోజుల్లోనే మరో 17 వేల నుంచి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వబోతున్నామని సగర్వంగా ప్రకటించారు.

**అవినీతి పిల్లర్లపై కాళేశ్వరం...!**

ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాలేదని, చేతల్లో చూపిస్తోందని మంత్రి అన్నారు. గత పాలకులు తాము చేసిన తప్పులను, అబద్ధాలను ఈ ప్రభుత్వంపై రుద్దాలని చూస్తున్నారని మండిపడ్డారు. "ఎన్నికల ముందే చెప్పాం... కాళేశ్వరం ప్రాజెక్టులోని ప్రతి పిల్లర్‌లోనూ అవినీతి కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని. ఇవాళ అదే నిజమైంది" అని విమర్శించారు. నీటిపారుదల శాఖపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని, అబద్ధాల ప్రచారం మానుకోకపోతే ప్రజలు రాబోయే రోజుల్లోనూ తగిన బుద్ధి చెప్పడం ఖాయమని? హెచ్చరించారు.

**పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం!**

అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు అందించడమే రేవంత్ అన్న నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి రెండవ విడత పూర్తి చేసిందని, రాబోయే రోజుల్లో మిగిలిన విడతలను కూడా శరవేగంగా పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు.



క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 11-7-2026 7

# నెంబర్ ప్లేట్లు లేని ద్విచక్ర వాహనాలను పోలీస్ స్టేషన్ కు తరలింపు



**వనపర్తి జూలై 10 క్రైమ్ మిర్రర్ :** వాహన తనిఖీలు నిర్వహించిన పోలీసులు పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు ప్రెస్ మరియు పోలీస్ స్టిక్కర్లు వాహనాలపై వాడితే వాటిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో నెంబర్ ప్లేట్లు లేని వాహనాలపై పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట, సుభాష్ చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న 70కి పైగా వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాహనదారులకు రహదారి భద్రత, మోటారు వాహన చట్టంలోని నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలకు అనుగుణంగా నూతన నెంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించి, వాటి ప్రాధాన్యాన్ని వివరించిన తర్వాత వాహనాలను విడుదల చేశారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో వివిధ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు మొత్తం రూ.50 వేల వరకు జరిమానాలు విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ... నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని అన్నారు. ఇలాంటి వాహనాలను నేర కార్యకలాపాలకు వినియోగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ముఖ్యంగా దొంగతనాలు, ఇతర నేరాల దర్యాప్తులో నెంబర్ ప్లేట్లు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలను సీజ్ చేసి, మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పోలీస్ శాఖకు సంబంధం లేని వ్యక్తులు తమ వాహనాలపై "పోలీస్" అని, అలాగే మీడియాకు సంబంధం లేని వారు "ప్రెస్" అని స్టిక్కర్లు లేదా బోర్డులు ఏర్పాటు చేసుకోవడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అలాంటి వాహనాలు గుర్తించినట్లయితే వాటిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని సీజ్ చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా నెంబర్ ప్లేట్లపై అనుమతి లేని డిజైన్లు, చిత్రాలు, గుర్తులు లేదా చదవడానికి ఇబ్బంది కలిగించే విధంగా రాతలు ఉండకూడదని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నెంబర్ ప్లేట్లను మాత్రమే ఉపయోగించాలని వాహనదారులకు సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, నెంబర్ ప్లేట్లు, హెల్మెట్ వంటి భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ వెంకటేష్ గౌడ్ గౌడ్ కోరారు. ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో 2వ ఎస్ఐ దివ్యారెడ్డి, ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటేశ్వర్ రెడ్డి, కానిస్టేబుళ్లు ప్రదీప్, కృష్ణ సాగర్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించి ఉన్నత శిఖరాలకు చేర్చాలి



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి(నాగర్ కర్నూల్):** ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పేద, గ్రామీణ, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను వెలికితీసి వారిని ఉన్నత స్థానాలకు చేర్చే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు. శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన నాగర్ కర్నూల్ కొల్లాపూర్ డివిజన్లకు సంబంధించిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల జిల్లా స్థాయి ఐటీసీ లెవల్ 3 శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే పవిత్రమైన బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం పొందడం ప్రతి ఒక్కరికీ గర్వకారణమే అయినప్పటికీ, తాము బోధించిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి, మంచి ఉద్యోగాలు సాధించి, సమాజంలో ఆదర్శప్రాయమైన వ్యక్తులుగా ఎదగడం చూసే ఆనందం, ఆత్మసంతృప్తి మరెక్కడా లభించదన్నారు. అలాంటి సంతృప్తిని ప్రతి ఉపాధ్యాయుడు తన సేవా కాలంలో అనుభవించాలని ఆకాంక్షించారు. తన తండ్రి సైతం ప్రభుత్వ ఉపాధ్యాయుడే అని, ఆయన ఉపాధ్యాయుల ఎదుగుదలకు ఆయన అనుభవించిన సంతృప్తిని నేను చిన్నప్పటి నుంచి గమనించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయులంటే తనకు ఎనలేని గౌరవం అని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఎన్నో సామాజిక, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ విద్యను అభ్యసిస్తున్నారని, అలాంటి పిల్లలకు పాఠ్యపుస్తకాల పరిజ్ఞానంతో పాటు జీవన నైపుణ్యాలు, శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచన, సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యాన్ని పెంపొందించే విధంగా బోధన సాగించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఆ ప్రతిభను గుర్తించి సరైన దిశలో ప్రోత్సహిస్తే వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు అపారంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో సమాచార సాంకేతిక పరిజ్ఞానం విద్యారంగంలో కీలక పాత్ర పోషిస్తోందని, మూడు రోజుల పాటు ఐసీటీ లెవల్ 3 ద్వారా శిక్షణ ద్వారా నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా తరగతి గదిలో అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. స్మార్ట్ టీవీలు, డిజిటల్ కంటెంట్, ఆన్‌లైన్ విద్యా వనరులు, ఇంటరాక్టివ్ బోధనా పద్ధతులను వినియోగించడం ద్వారా విద్యార్థుల్లో అభ్యాసంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు క్లిష్టమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా బోధించవచ్చని కలెక్టర్ చెప్పారు. ఉపాధ్యాయులు నిరంతరం తమ జ్ఞానాన్ని నవీకరించుకుంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, శిక్షణ కార్యక్రమాలను కేవలం హాజరు కోసమే కాకుండా బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశంగా భావించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ మూడు రోజుల శిక్షణలో భౌతిక రసాయన శాస్త్ర లో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో ఆచరణలో పెట్టి విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే బాధ్యత కూడా ఉపాధ్యాయులపైనే ఉందని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం, క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఉత్తమ విద్యాసంస్థలుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు తన పాఠశాలను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లాలో విద్యావ్యవస్థ డీఈవో ఆధ్వర్యంలో సరైన పద్ధతుల్లోనే కొనసాగుతుందని, ఇదివరవడిని ఈ విద్యా సంవత్సరం కొనసాగించి రానున్న ఫలితాల్లో ప్రస్తుత స్టైల్ అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరినీ అభినందించిన కలెక్టర్, ఈ శిక్షణ ద్వారా పొందిన విజ్ఞానాన్ని సహచర ఉపాధ్యాయులతో పంచుకోవడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లత, నాగర్ కర్నూల్, కొల్లాపూర్ డివిజన్లకు సంబంధించిన భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు, ఆర్ పి లు ప్రేమ్ రాజ్, శివకుమార్, హలీలుల్లా, సూర్యచైతన్య, తదితరులు పాల్గొన్నారు.



# బిఎల్వోలు ప్రజలకు ఎస్సార్ దరఖాస్తు ఫాముల పై అవగాహన కల్పించాలి :బిఆర్ఎస్ నాయకులు

**మందమర్రి టౌన్ జులై 10 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సార్ ప్రక్రియను మొదలు చేశారని అదే ప్రక్రియను మందమర్రిలో ప్రారంభం చేసి 24 బూతులకు 42 బిఎల్ఓ లను నియమించి ప్రక్రియను కొనసాగిస్తున్నారని శుక్రవారం మందమర్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఆర్ ప్రక్రియకు ప్రత్యేకంగా కేటాయించిన బిఎల్వోలు ప్రజల వద్దకు వెళ్లి దరఖాస్తు ఫాములను నింపి ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందని అన్నారు. కానీ ఏ బి ఎల్ ఓ ప్రజల దగ్గరికి వెళ్లి అవగాహన తెలిపిన సందర్భాలు లేవని ప్రభుత్వం వీరిని కేటాయించే ముందు వీరికి శిక్షణ ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. చాలామంది చదువుకొని ప్రజలు ముసలి వాళ్లు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు అలాంటి వారి దగ్గరికి వెళ్లి ఫాములు నింపే ప్రక్రియను కొనసాగించాలని అన్నారు. లేదా బి ఎల్ వో వారితో కాంగ్రెస్ నాయకులు టిఆర్ఎస్ నాయకులు ఒక సమావేశం ఏర్పాటు చేసినచో మేము కూడా వచ్చి మీకు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఒకవేళ మీరు అలా చేయలేని పక్షంలో మేము కూడా ప్రజల వద్దకు వెళ్లి వాళ్ళ ఫామ్స్ నింపుతామని అన్నారు. 2002 నుండి మీ జాబితా కావాలని చెప్పిన ప్రభుత్వం 24 తారీకు వరకే గడువు కేటాయించడంతో వారి జాబితాలు దొరకక ఏమి చేయాలో తెలవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాకనే చెన్నూరులో అభివృద్ధి జరిగిందని చెప్తున్నారు ఎక్కడ అభివృద్ధి జరిగిందో చూపెట్టాలని జరిగిన అభివృద్ధి బాల్క సుమన్ హయాంలోనే 2000 కోట్లు తీసుకొచ్చి చేసిన అభివృద్ధిని చూపించి మేమే చేశామని భుజాలు తరుముకుంటున్నారని పేర్కొన్నారు. పారదర్శకంగా డబుల్ బెడ్ అర్హులైన వారికే ఇచ్చామని చెప్తున్న ప్రభుత్వం ఇక్కడ అనర్హులకు కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని అర్హులైన వారికి చాలామందికి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వలేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండారి సూరిబాబు, ఎండి అబ్బాస్, కొంగల తిరుపతి రెడ్డి, ఓ రాజశేఖర్, బత్తుల శ్రీనివాస్, తోట సురేందర్, పల్లె నర్సింగ్, గొర్రె రామ్ చందర్, దాసరి రాజనర్సు, భూపెల్లి కనకయ్య, మొగరం శ్రీనివాస్, శ్రీ పెల్లి సాగర్, ఎండి మజూర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భగనుల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



**మందమర్రి టౌన్ జూలై 10 క్రైమ్ మిర్రర్:** మందమర్రి పట్టణంలో 24వ వార్షిక త్రైపాక్షిక భద్రత సమీక్షా సమావేశం ఇల్లందు క్లబ్‌లో శుక్రవారం మందమర్రి ,బెల్లంపల్లి ఏరియా కలిపి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ కె.వెంకటేశ్వర్లు, డీఎంఎస్ సాగేష్ కుమార్ అధికారులతో కలిసి ఇల్లందు క్లబ్ ఆవరణంలో మొక్కలు నాటి అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అనంతరం సింగరేణి డీజీఎంఎస్ గీతాల ప్రదర్శన అందరితో రక్షణ ప్రతిజ్ఞ చేయించి గని ప్రమాదాలలో మృతిచెందిన అమర కార్మికులకు సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించామని అన్నారు. ఈ సందర్భంగా డీఎంఎస్ మైనింగ్ సాగేష్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి భూగర్భ గనులు వివిధ విభాగాలలో రక్షణ సూత్రాలను తప్పనిసరిగా పాటిస్తూ ఉత్పత్తి సాధించాలని అన్నారు. మందమర్రి ఏరియాలో ప్రమాదాల శాతాన్ని 'జీరో పర్సంటేజ్' కు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఓపెన్ కాస్ట్, భూగర్భ గనుల్లో ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యంత కీలకమైన ప్రదేశాలలో అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన ఉద్యోగులను మాత్రమే విధుల్లో నియమించాలని తెలిపారు. అలాగే కార్మికుల వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణపై కూడా యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణిలో రక్షణ చర్యలపై యాజమాన్యం ఎక్కడా రాజీ పడకుండా, పకడ్బందీగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు సమన్వయంతో, కలిసికట్టుగా రక్షణ సూత్రాలు పాటిస్తూనే నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను విజయవంతంగా సాధిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీడీఎంఎస్ మైనింగ్ దీపక్ కుమార్ ప్రభాకర్, డీడీఎంఎస్ ఎలక్ట్రికల్ కోమల్ చౌదరి, మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎమ్ రమేష్, మందమర్రి ఏరియా ఏఐటీయూసీ గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, గోలేటి ఏరియా ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎస్.తిరుపతి, ఏరియా ఏజెంట్లు, గని మేనేజర్లు, సేఫ్టీ ఆఫీసర్లు, యూనియన్ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్లు పెద్ద సంఖ్యలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ను నిర్లక్ష్యం చేయకండి..

**కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** ఎస్ ఐ ఆర్ ను తేలికగా తీసుకొని ఎవరు నిర్లక్ష్యం చేయొద్దని కచ్చితంగా బిఎల్ఓ లు ఇచ్చిన ఎస్ఐఆర్ ఫామ్స్ నింపి తిరిగి బిఎల్ఓ కు అప్పగించాలని కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ హెచ్చరించారు. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 9వ, 10వ, 22వ, వార్డుల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ సవరణ జాబితా ఎస్ఐఆర్ కార్యక్రమాలను కల్వకుర్తి పట్టణ మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, లు స్థానిక వార్డు కౌన్సిలర్లతో కలిసి పరిశీలించారు. అనంతరం కల్వకుర్తి మున్సిపాలిటీకి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, లు పంపిణి చేశారు. అదేవిధంగా వారు 10వ వార్డులో స్థానిక వార్డు కౌన్సిలర్ షేక్ ఏజాస్, తో కలిసి ఇందిరమ్మ లబ్ధిదారి ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చీమ్మల శ్రీకాంత్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు చిత్తారీ ఎల్లమ్మ శ్రీనివాసులు, షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ యాహియఖాన్, నాయకులు చంద్రకాంత్ రెడ్డి, గణేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ని కలిసిన మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ కమిటీ...



**సంస్థాన్ నారాయణపురం, జూలై 10(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా నర్రి మల్లేష్ , ఉపాధ్యక్షునిగా మాచర్ల వినయ్ కుమార్ ఎన్నికైన సందర్భంగా మునుగోడు నియోజకవర్గ శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది. ఎమ్మెల్యే కి మల్లారెడ్డిగూడెం కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసిన నూతన కమిటీ. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిగూడెం గ్రామ ఉపసర్పంచ్ నర్రి ఎట్టయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు నర్రి ఐలయ్య, సీనియర్ నాయకులు జింకల మారయ్య, ఆలయ చైర్మన్ వీరమల్ల స్వామి, సీనియర్ నాయకులు కద్దాల సాయిలు, సిరిపంగి పెద్దలు, కొండూరి శ్రీనివాస్, 4వ వార్డ్ మెంబర్ సిరిపంగి అండాలు-కృష్ణ, 7వ వార్డ్ నెంబర్ బాతరాజు లాలు, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నర్రి రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు అక్షరాభ్యాసం

**అంగన్‌వాడీ కేంద్రాలే చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాదులు**

**14 వార్డ్ కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి నాగేశ్వరరావు**

**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** బాల్యంలోనే విద్యకు బలమైన పునాది వేయడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని 14 వార్డ్ కౌన్సిలర్ సరికొప్పుల విజయలక్ష్మి నాగేశ్వరరావు అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధి లోని చింతబండ, నేరేడుచర్ల 4అంగన్వాడీ కేంద్రం లో ఏఎల్ఎమ్సి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్త అడ్మిషన్ చిన్నారులకు అక్షరభ్యాసలను జరిపించిడం జరిగింది .ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులు ఉన్నత విద్యను అభ్యసించాలని ఆశీర్వదించారు. అదే విధంగా అంగన్వాడీ కేంద్రం అందించే అనుబంధ పోషకహారం గర్భిణీ మరియు బాలింతల యొక్క సర్వీసెస్ ను అందరు వినియోగించుకోవాలని తెలియచేసారు. పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచట్ గుడిపాటి జయమ్మ, గోరి , ఏఎల్ఎమ్ఎస్సి కమిటీ సభ్యులు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



# ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**30 నెలల్లో రూ.2,147 కోట్ల అభివృద్ధి పనులు**

**13,167 మంది లబ్ధిదారులకు రూ.79.89 కోట్ల ఆర్థిక సాయం**

**ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**

**శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



**వనపర్తి జూలై10 క్రైమ్ మిర్రర్:** గత 30 నెలల కాలంలో వనపర్తి నియోజకవర్గంలో రూ.2,147 కోట్ల విలువైన అభివృద్ధి పనులను చేపట్టి అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 17వ విడత ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తాను ప్రజల పెద్ద జీతగాడిలా పనిచేస్తున్నానని, గ్రామాలు--పట్టణాల సమగ్రాభివృద్ధితో పాటు ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు, పేద కుటుంబాల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అనేక విప్లవాత్మక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, ఆరోగ్య సేవల బలోపేతం, మహిళా సంఘాలకు చేయూత, ఇందిరమ్మ మహిళా శక్తి కార్యక్రమాలు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకొస్తున్నాయని చెప్పారు.ఈ సందర్భంగా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు.ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించేలా ఫోన్ ట్యాపింగ్ వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, సొంత చెల్లి ఫోన్ టాపింగ్ చేయడం లాంటి చర్యలు అత్యంత సిగ్గుచేటని అన్నారు.బీఆర్ఎస్ పాలనలో అవినీతి, భూకబ్జాలు, అధికార దుర్వినియోగం పెరిగిపోవడంతో ప్రజలే ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించి ఇంటికి పంపించారని పేర్కొన్నారు. దేశం కోసం, రాష్ట్రం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గొప్ప చరిత్ర కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, రాష్ట్ర అభివృద్ధిలోనూ కాంగ్రెస్ పాత్ర చిరస్మరణీయమని చెప్పారు.వనపర్తిలో గతంలో నియంతృత్వ ధోరణితో పాలన సాగిందని, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు సైతం సులభంగా కలిసే అవకాశం లేకుండా వ్యవహరించారని విమర్శించారు.ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులనే ప్రజలు ఆదరిస్తారని స్పష్టం చేశారు.గత ప్రభుత్వం తెలంగాణను భారీ అప్పులపాలు చేసిందని ఆరోపించిన ఎమ్మెల్యే, ప్రస్తుతం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో పాటు సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని పురోగతి దిశగా నడిపిస్తోందన్నారు.తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహనీయులను గౌరవించడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని పేర్కొన్నారు.అలాగే బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసే విమర్శలకు ముందు తమపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ, ఆధారరహిత వ్యాఖ్యలు చేసే నైతిక హక్కు వారికి లేదన్నారు. వనపర్తిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.79.89 కోట్ల ఆర్థిక సహాయం 2026 జూలై 10 నాటికి వనపర్తి నియోజకవర్గంలో మొత్తం 13,167 మంది లబ్ధిదారులకు రూ.79,89,25,560 విలువైన ఆర్థిక సహాయం అందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ముఖ్యమంత్రి సహాయనిధి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ఈ పథకం గొప్ప అండగా నిలుస్తోందన్నారు.ఇప్పటివరకు 7,371 మంది లబ్ధిదారులకు రూ.18,05,65,900 మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందులో గతంలో 7,088 మందికి రూ.17,01,11,800 అందగా, తాజాగా 283 మందికి రూ.1,04,54,100 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు.కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొంటూ, ఇప్పటివరకు 5,385 మంది లబ్ధిదారులకు రూ.53,91,24,660 మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో 5,038 మందికి రూ.50,43,84,408 అందగా, తాజాగా 347 మందికి రూ.3,47,40,252 చెక్కులు పంపిణీ చేసినట్లు వివరించారు.ఎల్ఓసీ అత్యవసర వైద్య చికిత్స అవసరమైన నిరుపేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అందించేందుకు అమలు చేస్తున్న ఎల్ఓసీ పథకం కింద ఇప్పటివరకు 411 మంది లబ్ధిదారులకు రూ.7,92,35,000 విలువైన వైద్య సహాయం అందించినట్లు తెలిపారు. ఇందులో గతంలో 339 మందికి రూ.6,47,15,000, తాజాగా 72 మందికి రూ.1,45, 20,000 మంజూరు చేసినట్లు వెల్లడించారు. వనపర్తి పట్టణం, వనపర్తి, పెద్దమందడి, ఖిల్లాఘన పురం, గోపాల్పేట, రేవల్లి,ఏదుల, శ్రీరంగాపూర్, పెబ్బేరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా చెక్కులను అందజేశారు. ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సహాయం అందేలా కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అభివృద్ధి సంక్షేమం రెండింటినీ సమాన ప్రాధాన్యంతో ముందుకు తీసుకెళ్తూ వనపర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు నాయ కులు, కార్యకర్తలు యువకులు, మహిళలు మున్సిపల్ చైర్మన్లు వైస్ చైర్మన్ కౌన్సిలర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు వైస్ చైర్మన్లు డైరెక్టర్లు మాజీ మాజీ ఎంపీపీలు మాజీ జెడ్పిటిసిలు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు సర్పంచులు లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి అవకాశం లభిస్తుంది

**పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రాంమ్మోహన్ రెడ్డి**

**కుల్కచర్ల పీఏసీఎస్ నూతన చైర్మన్ల పాలకవర్గ సన్మానం ప్రమాణ స్వీకారం**

**క్రైం మిర్రర్ కుల్కచర్ల:** కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికి పార్టీ అవకాశాలు కల్పిస్తుందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రాంమ్మోహన్ రెడ్డి సూచించారు.వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో శుక్రవారం పివిఆర్ గార్డెన్‌లో జరిగిన కుల్కచర్ల పీఏసీఎస్ నూతన చైర్మన్ పాలక వర్గం సన్మాన ప్రమాన స్వీకారం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బాధ్యతలు స్వీకరించిన బొలుసాని భీమ్ రెడ్డిని, వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ నూతన పాలకవర్గాన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడ్డ చైర్మన్ వైస్ చైర్మన్ పాలకవర్గం రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. నూతన చైర్మన్గా ఎన్నుకోబడ్డా భీమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఆయన జీవితకాలమంతా ఎంతో కష్టపడి పార్టీని ఎంతో ముందుకు తీసుకుపోతున్నారని, కాంగ్రెస్ అంటే భీమ్ రెడ్డి,భీమ్ రెడ్డి అంటే కాంగ్రెస్ అని వారు గుర్తు చేశారు. అందుకే నూతన చైర్మన్ భీమిరెడ్డి లాగా ప్రతి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలని అప్పుడే వారికి పార్టీలో మంచి గుర్తింపు వుండి మంచి అవకాశాలు ఉంటాయని వారు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, సహకార సంఘాలు రైతులకు మరింత చేరువ కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్,చౌడపూర్ మండలం అధ్యక్షులు చంద్రశేఖర్, పిఎసిఎస్ డైరెక్టర్లు సెల్మిల్ల ఆనందం, మానెమ్మ వెంకటయ్య చెన్నయ్య బోయిని కృష్ణయ్య దామోదర్ రెడ్డి, కుల్కచర్ల వార్డు సభ్యులు మోత్కూరి వెంకటేష్, సర్పంచులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లక్షలతో మార్కెట్ యార్డ్ కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన పరిగి ఎమ్మెల్యే



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న మార్కెట్ యార్డ్ కార్యాలయ భవన నిర్మాణానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, మార్కెట్ యార్డ్ కార్యాలయ భవనం నిర్మాణంతో రైతులు, వ్యాపారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీమ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వారువాళ్ళ అంజిలయ్య, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపాల్ నాయక్, చోడపూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు భరత్ కుమార్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతకాయల జంగయ్య,స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి**

**టిఆర్ఎస్వి చైతన్య సదస్సు వాల్ పోస్టర్లు విడుదల**

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** తెలంగాణ రాష్టంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా రాష్ట్రానికి ఇప్పటి వరకు విద్య శాఖ మంత్రి లేకపోవడం, కాంగ్రెస్ పాలనకు సిగ్గు చేటు అని, విద్యార్థులకు ఇంతవరకు ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం టిఆర్ఎస్వి చైతన్య సదస్సు ఈ నెల 22 తారీఖున ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియం జరుగనుందని, ఈ చైతన్య సదస్సు కార్యక్రమన్ని విజయవంతం చేయాలనీ పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మరికల్ పాండు, మొగుళ్లపల్లి మొగులయ్య, టిఆర్ఎస్వి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీలు సహకరించాలి

**- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పూర్తిస్థాయి పారదర్శకత, నిష్పాక్షికతతో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమం పురోగతిపై ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని, బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వోలు) ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఓటరు నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, ఇంటింటి సర్వే నిర్వహణ, బీఎల్‌వోల పనితీరు తదితర అంశాలపై తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను సమావేశంలో వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి అంశాన్ని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శ్రద్ధగా విని, సంబంధిత అధికారులకు తక్షణమే అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ప్రతి ఫిర్యాదు, ప్రతి అభ్యర్థనను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటూనే, అర్హత కోల్పోయిన వారి వివరాలను నిబంధనల ప్రకారం తొలగించడం, అవసరమైన సవరణలు చేపట్టడం వంటి ప్రక్రియలను పూర్తి పారదర్శకతతో నిర్వహిస్తున్నామని వివరించారు. ఓటరు జాబితా తయారీ ప్రక్రియలో రాజకీయ పార్టీల భాగస్వామ్యం అత్యంత కీలకమని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. రాజకీయ పార్టీల సహకారంతో ఎన్నికల ప్రక్రియ మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా కొనసాగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణ, చిరునామా మార్పులు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలు ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహిస్తున్నట్లు, ఈ కార్యక్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా మార్పులు లేదా సవరణలు అవసరమైతే నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్‌తో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, బాలకృష్ణ, ఎండి హుస్సేన్, నరసింహ, రామకృష్ణ, తదితరులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కుల్కచర్లలో భవిత సెంటర్ బిల్డింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే టిఆర్ఆర్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో రూ.9.50 లక్షల వ్యయంతో భవిత సెంటర్ బిల్డింగ్ నిర్మాణానికి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పుట్టుకతో గానీ లేదా జీవితంలో ఏదైనా దశలో మానసిక లేదా శారీరక అంగవైకల్యం కలిగిన చిన్నారులకు,అలాగే చెవుడు, మూగ ఇతర ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు మెరుగైన చికిత్స అందించేందుకు ఈ భవిత సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.గతంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి పరిగి నియోజకవర్గానికి ఆహ్వానించిన సమయంలో పూడూరు మండల కేంద్రంలో కూడా ఇలాంటి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ఈ భవిత సెంటర్ ద్వారా అర్హులైన చిన్నారులు, వారి కుటుంబాలు ప్రయోజనం పొందేలా ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, స్థానిక సర్పంచ్ వారువాళ్ళ అంజిలయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవి, స్వామి, చాకలి వెంకటేష్ స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, భవిత సెంటర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కోల్ బెల్ట్ యువతతో తిండిబోతు "తిండిబోతు" షార్ట్ ఫిలిం ప్రారంభం

**మందమర్రి, జూలై 10 (క్రైమ్ మిర్రర్ ):** కోల్‌బెల్ట్ ప్రాంత యువత నటనపై ఆసక్తితో సినీ రంగంలో తమదైన ముద్ర వేయడానికి ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరాంపూర్ కార్మికవాడలో రూపొందిస్తున్న 'తిండిబోతు' షార్ట్‌ఫిల్మ్ షూటింగ్ పూజా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.హాస్యంతో పాటు సామాజిక సందేశాన్ని అందించేలా చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు దర్శకుడు తాడిచెట్టి వెంకటేష్ తెలిపారు. నిర్మాతగా వెలిసోజు జ్యోతి, ఛాయాగ్రాహకుడిగా విక్టరీ అశోక్ వ్యవహరిస్తున్నారు. షార్ట్‌ఫిల్మ్‌తో పాటు రూపొందనున్న వెబ్‌సిరీస్‌లో శ్రీరాంపూర్, మందమర్రి కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన యువతీ, యువకులకే నటించే అవకాశం కల్పించడం విశేషం. స్థానిక ప్రతిభను ప్రోత్సహించే ఈ ప్రయత్నాన్ని ప్రాంత ప్రజలు అభినందించారు. సినీ రంగంలో కోల్‌బెల్ట్ యువత మరింత గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు.

## ఆత్మకూరు(ఎం)మండల విద్యాధికారి నియామకం

**ఆత్మకూరు(ఎం),జూలై10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం నూతన మండల విద్యాధికారిగా జి.ప. ఉ.పా.కొరటికల్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పానుగంటి వెంకట రామ్ రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్జేడీ ఓ డిఇఓ కార్యాలయం నుంచి ఆత్మకూరు(ఎం)మండల ఎంఇఓ(ఎఫ్ఏసీ)గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.శుక్రవారం రోజు మండల కేంద్రంలోని ఎంఆర్సీ నందు బాధ్యతలు చేపట్టడం జరిగినది.అనంతరం నూతన మండల విద్యాధికారిని కార్యాలయ సిబ్బంది ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది.



క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 11-7-2026


# గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్)** గ్రామాల సమగ్రాభివృద్ధికి గ్రామ పంచాయతీలే ప్రధాన కేంద్రాలుగా మారాలని, ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా స్వంత ఆర్థిక వనరులను పెంపొందించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని, ప్రజల అవసరాలు, గ్రామ భవిష్యత్ అవసరాలు, స్థానిక పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి వచ్చే మూడు సంవత్సరాలకు గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా గగ్గలపల్లిలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ--2026) రూపకల్పనపై గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో ఒకరోజు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి లక్ష్యాలను గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేయాలంటే గ్రామ పంచాయతీలు బలోపేతం కావడం అత్యంత అవసరమని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ తన పరిధిలోని సమస్యలను గుర్తించి, ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామసభల్లో చర్చించి శాశ్వత ప్రయోజనం కలిగించే అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలని సూచించారు. గ్రామ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడమే గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ముఖ్య ఉద్దేశమని వివరించారు. సర్పంచులు గ్రామ ప్రజలకు నాయకత్వం వహించే వ్యక్తులని, భారత క్రికెట్ జట్టు కెప్టెన్ తన జట్టును విజయపథంలో నడిపించినట్లే సర్పంచులు కూడా గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ క్రికెట్ భాషలో వర్ణిస్తూ జిల్లాలో అనేక మంది సర్పంచులు మంచి బ్యాట్ మెన్స్, మంచి బౌలర్లు గా ఉన్నారని, క్రికెట్‌లో బౌన్సర్ బంతులను ధైర్యంగా ఎదుర్కొన్నట్లే పరిపాలనలో ఎదురయ్యే ఇబ్బందులను కూడా సమర్థంగా ఎదుర్కొని గ్రామాభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని, తమ పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా గ్రామ ప్రజలు గుర్తుంచుకునే విధంగా శాశ్వత ఆస్తులను సృష్టించాలని కోరారు. తాగునీటి వసతి, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, వీధి దీపాలు, పచ్చదనం, చెరువుల సంరక్షణ, వంటి ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీల ఆర్థిక స్వావలంబనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, పన్నుల వసూళ్లను మెరుగుపరచడం, గ్రామ పంచాయతీ ఆస్తులను సక్రమంగా వినియోగించడం, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్థానిక ఆదాయ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. ఆర్థికంగా బలోపేతమైన గ్రామ పంచాయతీలే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలవన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టే ప్రతి పని ప్రభుత్వ నిబంధనలు, చట్టాలు, ఆర్థిక నియమాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పారదర్శకంగా పనులు నిర్వహించాలని, ప్రజాధనాన్ని అత్యంత బాధ్యతతో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. సర్పంచులు గ్రామ ప్రజలకు అత్యంత చేరువలో ఉండే ప్రజాప్రతినిధులని, గ్రామాభివృద్ధికి సంబంధించిన ఎలాంటి సమస్య వచ్చినా ఎప్పుడైనా తనను నేరుగా కలిసి వివరించవచ్చని చెప్పారు. సర్పంచులంటే తనకు ప్రత్యేక గౌరవమని, జిల్లా అభివృద్ధిలో వారందరూ భాగస్వాములు కావాలని, భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ కోరారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, సవరణలు ఈ నెల 24వ తేదీలోగా పూర్తయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఓటును రక్షించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని తెలిపారు. వాతావరణ పరిస్థితులపై కూడా కలెక్టర్ సర్పంచులకు కీలక సూచనలు చేశారు. భారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లాలో రానున్న మూడు నెలలపాటు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున నీటి వనరులను అత్యంత పొదుపుగా వినియోగించాలని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకే వినియోగించే పరిస్థితి నెలకొన్నందున రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. శిక్షణా కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు వివరించిన అంశాలను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పూర్తిగా అవగాహన చేసుకుని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ కోరారు. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో గ్రామసభలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...., గ్రామ పాలనకు సర్పంచులే కేంద్రబిందువని పేర్కొన్నారు. రాజ్యాంగం గ్రామ పంచాయతీలకు కల్పించిన అధికారాలను ప్రజా సంక్షేమానికి వినియోగించి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. తాగునీరు, పారిశుద్ధ్యం, గ్రామీణ రహదారులు, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన, మహిళా సాధికారత, యువత అభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి వంటి అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సర్పంచులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం గ్రామ సర్పంచ్‌లకు ప్రత్యేక అధికారాలు కల్పించిందని, గ్రామ ప్రథమ పౌరుడిగా, గ్రామసభ అధ్యక్షుడిగా గ్రామాభివృద్ధికి సర్పంచ్ నాయకత్వం వహించాలని అన్నారు. గ్రామానికి ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి వచ్చినా, గ్రామానికి అధికారిక అధ్యక్షుడు సర్పంచేనని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల, వీధి దీపాల నిర్వహణ, రోడ్ల మరమ్మతులు వంటి మౌలిక సదుపాయాలపై ప్రతి సర్పంచ్ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని చెప్పారు.



## చేనేత సహకార సంఘం ఎన్నికల్లో పద్మశాలి సంఘం ప్యానల్ ఘనవిజయం

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు చేనేత సహకార సంఘానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో చండూరు పద్మశాలి సంఘం ప్యానల్ ఘన విజయం సాధించింది. చైర్మన్గా పున్న దర్మేందర్ ఎంపిక లంచన ప్రయంగా మారింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో పున్న దర్మేందర్, గంజి అశోక్, చెరుపల్లి కృష్ణ, కోమటి ఓంకారం, ఏలే శ్రీనివాస్, తిరందాస్ నర్సింహా, జూలూరు వెంకటేష్ గెలుపొందరు. కాగా ఇప్పటికే తిరందాస్ సుధా,గుర్రం కవిత ఏక గ్రీవంగా ఎంపిక అయ్యారు. దింతో పున్న ధర్మేందర్ అధ్యక్ష పదవి లంచన ప్రయంగా మారింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 749 ఓట్లకు గాను 669 ఓట్లు పోలయ్యాయి. 32 ఓట్లు కాలిపోయాయి.రేపు ఉదయం కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరగనుంది.

## శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జెవివి కృషి ప్రశంసనీయం

**జిల్లా విద్యాశాఖ అధికారి బి. బిక్షపతి**



**ఆత్మకూరు(ఎం),జూలై10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా డీఈఓ ఆఫీసులో శుక్రవారం రోజు జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు కార్యక్రమం సందర్భంగా " నేను ఆడపిల్లను " అనే వాల్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి మాట్లాడుతూ శాస్త్రజ్ఞానం ద్వారా మూఢవిశ్వాసాలను అశాస్త్రీయ భావాలను ఎండకట్టడంతోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న అనేక మౌలిక స్వభావాలను గూర్చి సమగ్రమైన శాస్త్రీయ అవగాహనను పెంపొందించడం, వాటికి పరిష్కారాలను అన్వేషించడంలో జె వి వి కృషి బాగుందని అన్నారు. ప్రకృతి పానీయాలను సేవించాలని, కాలుష్య నియంత్రణ ఉండాలని ప్లాస్టిక్ వ్యతిరేక పోరాటాలు జీవవైద్యాన్ని కాపాడుకోవడం కోసం విశేష కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల కోసం సైన్సు, ప్రగతి కోసం సైన్స్ సాలంబలం...

## ఆత్మకూరు[ఎం]లో ఆసర్ కేంద్రాలను పరిశీలించిన బిజెపి యాదాద్రి భువనగిరి సర్ ఇంచార్జి వట్టిపల్లి శ్రీను



**ఆత్మకూరు(ఎం),జూలై10/క్రైమ్ మిర్రర్:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో సర్ కేంద్రాలను పరిశీలించిన భారతీయ జనతా పార్టీ సర్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జీ వట్టిపల్లి శీను శుక్రవారం రోజు పరిశీలించడం జరిగింది. ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో సర్ 70 శాతం అయినందుకు బిఎల్ఓ లను అభినందించినారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య,జిల్లా కోశాధికారి గుజ్జ సోమ నరసయ్య గుప్తా,సర్పంచ్ బీసు ధనలక్ష్మి,ఉప సర్పంచ్ మజ్జిగ నరేష్,బీజేవైఎం నాయకులు బొజ్జ పవన్,బిఎల్వో లు తదితరులు పాల్గొన్నారు.

## గద్దె దిగుతారా పొలాలకు నీళ్లు ఇస్తారా మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్



**ఆత్మకూరు(ఎం),జూలై 10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు కాళేశ్వరం ప్రాజెక్టు నుండి వృధాగాపోతున్న గోదావరిజలాలు కన్నెపల్లి నుండి ఎత్తిపోసి గందమల్ల, బస్వాపూర్, ప్రాజెక్టులకు మల్లించాలని ధర్నా లో పాల్గొన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్,వారు మాట్లాడుతూ గోదావరిలో వృధాగాపోతున్న లక్షక్యూసెక్కుల జలలను ఆపాలి.గద్దె దిగుతారా పొలాలకు నీళ్ళు ఇస్తారా కన్నెపల్లి పంపుహౌజ్ నుండి గోదావరి జలాలు ఎత్తిపోయాలి.కాళేశ్వరం జలాలు ఇవ్వలేని ప్రభుత్వం రాజీనామా చెయ్యాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి,భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ వెల్మినేటి సందీప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి,చింతల వెంకటేశ్వర్ రెడ్డి, తదితర రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకులు ఊరిపక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఊరిపక్క నగేష్ జన్మదినం సందర్భంగా, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పట్ల స్పందించే తత్వం, పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతతో, ఊరిపక్క నగేష్ ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, సేవలు అందిస్తున్నారని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. గ్రామ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి నగేష్ చేస్తున్న కృషి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. భగవంతుని ఆశీస్సులతో నగేష్ సంపూర్ణ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, రాజకీయ జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ శుభ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున నామాపురం గ్రామంలో సమావేశమై,. నగేష్ కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో ఆయన ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి, గ్రామ ప్రజలకు మరింత చేరువై మరిన్ని పదవులు అలంకరించాలని అందరూ కోరుకున్నారు.

## చేనేత సహకార సంఘం ఎన్నికల్లో పద్మశాలి సంఘం ప్యానల్ ఘనవిజయం

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు చేనేత సహకార సంఘానికి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో చండూరు పద్మశాలి సంఘం ప్యానల్ ఘన విజయం సాధించింది. చైర్మన్గా పున్న దర్మేందర్ ఎంపిక లంచన ప్రయంగా మారింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో పున్న దర్మేందర్, గంజి అశోక్, చెరుపల్లి కృష్ణ, కోమటి ఓంకారం, ఏలే శ్రీనివాస్, తిరందాస్ నర్సింహా, జూలూరు వెంకటేష్ గెలుపొందరు. కాగా ఇప్పటికే తిరందాస్ సుధా,గుర్రం కవిత ఏక గ్రీవంగా ఎంపిక అయ్యారు. దింతో పున్న ధర్మేందర్ అధ్యక్ష పదవి లంచన ప్రయంగా మారింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 749 ఓట్లకు గాను 669 ఓట్లు పోలయ్యాయి. 32 ఓట్లు కాలిపోయాయి.రేపు ఉదయం కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరగనుంది.



## రైతులకు తగులుతున్న విద్యుత్ తీగలు

**విద్యుత్ తీగలు పైకి అమర్చాలి :రైతు లింగస్వామి**



**ఆత్మకూరు(ఎం),జులై 10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామ రైతు కన్నెబోయిన లింగస్వామి,బావి మరియు నరిగే వారి బావి దగ్గర రైతులకు తాకుతున్న విద్యుత్ తీగలు గత సంవత్సరం నుండి తీగలను పైకి అమర్చాలని విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన తమ సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేసిన రైతు కన్నెబోయిన లింగస్వామి తమ పొలం దున్నేటప్పుడు పొలం పనులు చేసేటప్పుడు చాల ఇబ్బంది అవుతుంది. బిల్లులు సమయానికి వసూళ్లు చేస్తారు.విద్యుత్ సరఫరా సరిగ్గా రావడం లేదు అని అన్నారు. తక్షణమే విద్యుత్ తీగలను స్థంబాలు నాటి తీగలను పైకి అమర్చాలని తెలిపారు.

## ఆత్మకూర్(ఎం)మండల పిఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ఆత్మకూరు(ఎం),జూలై10/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసీఎస్)నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరై నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆత్మకూరు(ఎం) మండల పిఏసీఎస్ చైర్మన్‌గా యాస లక్ష్మారెడ్డి,ఆయనతో పాటు నూతన పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు, ధాన్యం కొనుగోలు, సహకార సేవలు పారదర్శకంగా అందించి పిఏసీఎస్ లను మరింత బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నూతన పాలకవర్గ సభ్యులు రైతుల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి రైతుకు చేరవేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సహకార శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు,పిఏసీఎస్ సభ్యులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.



# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న డిజిటలైజ్ ప్రక్రియ వేగవంతం చేయాలని భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ పవన్ కుమార్ శర్మ అన్నారు. శుక్రవారం న్యూ ఢిల్లీ నుండి కార్యదర్శి నవీన్ కుమార్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో పారదర్శకత ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమని అన్నారు. ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల జాబితాను నవీకరించవలసిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఆర్డీవోలు తాహసిల్దార్లతో మాట్లాడుతూ..... భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మ్యాపింగ్ చేసిన డాటా ఆధారంగా ఎన్యుమరేషన్ ఫారాలను సరిచూసుకొని డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చెయ్యాలని తెలిపారు. ఇంటింటి సర్వేలు, బూత్ స్థాయి అధికారుల పని తీరు, ఓటరు జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, సవరణ ప్రక్రియలను ఖచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మిగిలిన ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి ఈ నెల 24 తేదీ నాటికి డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని, గతంలో కూడా 2002, లో ప్రత్యేక సవరణ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఏ ఒక్క అర్హులైన పౌరుడు ఓటు హక్కు కోల్పోకుండా, అనర్హులు జాబితాలోకి చేరకుండా క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారమ్ అందజేసిన ఓటర్లందరినీ ముసాయిదా జాబితాలో చేర్చడం జరుగుతుందని, విచారణ లేకుండా ఏ ఓటరు పేరును జాబితా నుండి తొలగించకూడదని తెలిపారు. దరఖాస్తుదారులకు తగిన విచారణ ద్వారా వారి అర్హతను ధృవీకరించిన అనంతరం తుది నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. తుది జాబితా ప్రచురణ తర్వాత ఎవరైనా అసంతృప్తిగా ఉంటే జిల్లా మేజిస్ట్రేట్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేపట్టడం జరుగుతుందని, ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1,200, కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ప్రతిబిఎల్ ఓ ప్రతిరోజు 60 మంది ఓటర్ల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని కలెక్టర్ తాసిల్దారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అరుణ రెడ్డి, ఆర్డీవోలు అర్చన, బన్సిలాల్, యాదగిరి, ఎన్నికల విభాగం అధికారులు మండలాల తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఏఐఎస్ఎఫ్- ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ, వామపక్ష విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో, శుక్రవారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ మర్రిగూడ మండలంలో సంపూర్ణంగా విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల విలీనం, ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీ చేయకపోవడం, విద్యాసంస్థలకు తగిన నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు, ప్రభుత్వ పాఠశాలల తరగతులను బహిష్కరించి నినాదాలు చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులు, డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజుల పేరుతో, తల్లి దండ్రులను దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని, విద్యను హక్కు నుంచి వ్యాపారంగా మారుస్తున్నారని వారు ఆరోపించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మండల ఇంచార్జీ ఇస్కిల్ల మహేందర్ మాట్లాడుతూ.. పాఠశాలలు, జూనియర్ కళాశాలల విలీనాన్ని వెంటనే నిలిపివేయాలని, అన్ని ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల కోసం 10వేల కోట్ల నిధులను విడుదల చేయాలని, ఆర్టిఐ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి, ప్రభుత్వ విద్యాసంస్థలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల ఉపాధ్యక్షుడు పొట్ట అశోక్, యాదగిరి, ఉదయ్, తనేష్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** నూతనకల్ మండలంలోని రైతులందరికీ పూర్తిస్థాయిలో రైతు భరోసా నిధులు జమ అయ్యాయని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మిర్యాల రైతు వేదికలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,ఖమ్మం జిల్లా మధిర మండలంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభను ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నూతనకల్ మండలంలోని 10,052 మంది రైతులకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద రూ.12,67,43,795లను జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగానే తొమ్మిది రోజుల్లో రూ.9,000 కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని పేర్కొన్నారు. రైతులు పెట్టుబడి సాయాన్ని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకొని, సాగు ఖర్చులను తగ్గించుకొని, అధిక దిగుబడులు మరియు ఆదాయాన్ని సాధించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. సైదా నాయక్ , వ్యవసాయ విస్తరణ అధికారి పావని రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 24 లోగా ఎన్యుమరేషన్ ఫారాలను తిరిగి ఇవ్వాలి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓటర్లందరు ఈ నెల 24వ తేదీ లోగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ ఓ) లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి బీఎల్ ఓ లకు పాస్ పోర్ట్ సైజు ఫోటో పెట్టి ఇవ్వాలని, అలా ఇచ్చిన వారి పేర్లు మాత్రమే జూలై 31న విడుదల చేసే ఓటరు జాబితా డ్రాఫ్ట్ లో ఉంటాయని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శుక్రవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నిర్వహించిన సమీక్షా సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఎన్యుమరేషన్ ఫారాలను (ఈఎఫ్) డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించడం జరిగిందన్నారు. జూలై 24 లోగా ఓటర్లనుంచి వచ్చిన ఎన్యుమరేషన్ ఫారాలన్నింటిని అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని మెల్లిగా పూర్తి చేసి ఇస్తామంటే ఓటరు పేరు త్వరలో వచ్చే డ్రాఫ్ట్ లో ఉండదన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఒక ఈఆర్ఓ, ఏడుగురు ఏఈఆర్ లు, 55 మంది వరకు సూపర్వైజర్లు, 547 మంది బీఎల్ఓ లు ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి తిరిగి తీసుకునే పనిలో ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల నుంచి నియమితులైన బీఎల్ఏ లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, య వజన సంఘాలు ఓటర్లను చైతన్యం చేసి సకాలంలో ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసే విదంగా చూడాలన్నారు. ఇప్పుడు ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తి చేసి ఇవ్వకపోతే ఆగస్టు లో అన్ని దృవీకరణ పత్రాలు పెట్టి ఫారం 6 సమర్పించాల్సి ఉంటుందని, అలా చేసిన వారి పేరు అక్టోబరు లో వచ్చే తుది ఓటరు జాబితా లో పొందుపరచడం జరుగుతుందన్నారు. అలా కాకుండ ఈ నెల 24లోగా ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తే బాగుంటుందని తెలిపారు. ఇతర సమాచారం కోసం... క్రింద ఇచ్చిన ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

**ఏఈఆర్ ఓ ల పేర్లు, ఫోన్ నెంబర్లు:**

ఎన్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఆర్ఓ (గండిపేట్ తహసీల్దార్) - 7995086358

జి లక్ష్మారెడ్డి, ఏఈఆర్ఓ ( డిప్యూటీ కమిషనర్, నార్సింగి) - 9121529597

బి సురేందర్ రెడ్డి, ఏఈఆర్ ఓ ( డిప్యూటీ కమిషనర్, రాజేంద్రనగర్) - 8712499 189 బొమ్మ రాములు, ఏఈఆర్ఓ ( తహసీల్దార్, రాజేంద్రనగర్) - 9849904231 మల్లయ్య, ఏఈఆర్ఓ ( డిప్యూటీ కమిషనర్, అత్తాపూర్) - 6309529286 సుమన్ రావు, ఏఈఆర్ఓ ( డిప్యూటీ కమిషనర్, శంషాబాద్) - 7337336191 అమర్ లింగం గౌడ్, ఏఈఆర్ఓ (తహసీల్దార్, శంషాబాద్) - 9849904287


# బోధనలో నైపుణ్యాలు పెంచుకోవాలి



**మంచిర్యాల, జూలై 10 (క్రైమ్ మిర్రర్) :** ఉపాధ్యాయులు తమ బోధన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహించిన సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలానుగుణంగా బోధన పద్ధతులను మార్చుకుంటూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. భౌతిక శాస్త్ర బోధనలో ప్రయోగాలు, కృత్యాధార అభ్యసనానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని చెప్పారు. డిజిటల్ లిటరసీపై ప్రతి విద్యార్థికి అవగాహన కల్పిస్తూ సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసేలా బోధన సాగించాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు తగినంత మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. తరగతి గదులు, తాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్ల వంటి వసతులు కల్పించడంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగి, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థుల చేరికలు పెరుగుతున్నాయని తెలిపారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు మరింత పెంచేందుకు కృషి చేయాలన్నారు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉప్పర్‌పల్లిలో ఘనంగా స్వామివార్ల తృతీయ వార్షికోత్సవ వేడుకలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** దేవాలయాల్లో దైవచింతనతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తాయని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లిలో గల సాయిబాబా మందిరంలో శ్రీ గణపతి స్వామి, శ్రీ సాయినాథ స్వామి, దత్తాత్రేయ స్వామివార్ల తృతీయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. ఈ పవిత్ర వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివార్లను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పర్‌పల్లికి చెందిన శ్రీ వీరాంజనేయ భక్త సమాజం వారి ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో సామ ఇంద్రపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జూలై 20 లోగా ఎన్యుమరేషన్ ఫారాలు ఇవ్వకుంటే ఓటు హక్కు గల్లంతు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లకు ఎన్నికల అధికారులు కీలక హెచ్చరిక జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం నిర్వహించిన సమీక్షా సమావేశంలో భాగంగా నియోజకవర్గాల వారీగా ఎన్యుమరేషన్ ఫారమ్స్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఓటర్లు తమ ఓటు హక్కును భద్రపరుచుకోవడానికి తక్షణమే స్పందించాలని అధికారులు కోరారు. నియోజకవర్గ ఓటర్లందరూ తమకు అందించిన ఎన్యుమరేషన్ ఫారమ్‌ను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తిగా భర్తీ చేయాలి. ఆ ఫారమ్‌పై తమ ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను తప్పనిసరిగా అతికించి, జూలై 20 లోగా సంబంధిత బూత్ లెవల్ అధికారికి స్వయంగా అందజేయవలసి ఉంటుంది. నిర్ణీత గడువులోగా పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారమ్‌ను సమర్పించని పక్షంలో, సదరు ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఓటు హక్కు అనేది ప్రతి పౌరుడి బాధ్యత, రక్షణ అని గుర్తు చేస్తూ మీ ఓటు - మీ భద్రత అనే నినాదంతో ఈ ప్రకటనను విడుదల చేశారు. కాబట్టి, రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఓటరు మహాశయులందరూ ఈ విషయాన్ని గమనించి, గడువు ముగిసేలోగా తమ ఫారాలను బీఎల్‌ఓలకు అందించి సహకరించాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అటెన్షన్ డైవర్షన్ గ్యాంగ్ గుట్టురట్టు

**- ఒకరి అరెస్ట్, ముగ్గురు పరారీ. - భారీగా బంగారం స్వాధీనం**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** బస్సుల్లో ప్రయాణికుల దృష్టి మళ్లించి బంగారు గొలుసులు దొంగిలిస్తున్న అంతర్-జిల్లా ముఠాకు చెందిన ఒక పాత నేరస్థుడిని అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు 30 గ్రాముల బరువు గల నాలుగు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలోని మరో ముగ్గురు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గతేడాది అక్టోబర్ 16వ తేదీన బండ్లగూడ జాగీర్‌కు చెందిన వ్యాపారవేత్త గాజుల సతీష్ కుమార్ పిల్లర్ నంబర్ 143 వద్ద బస్సు ఎక్కారు. అదే బస్సులో ప్రయాణిస్తున్న హథకడే విశాల్ (25), తన స్నేహితులైన రవి, జహంగీర్ , శ్యామ్ సుందర్ లతో కలిసి సతీష్ కుమార్ మెడలోని 1.25 తులాల బంగారు గొలుసును గమనించారు. బస్సు ఆరామ్‌ఘర్ బస్ స్టాండ్ వద్దకు రాగానే, బాధితుడు బస్సు ఫుట్‌బోర్డ్‌పై దిగడానికి సిద్ధమయ్యాడు. ఇదే అదవనుగా చూసుకుని నలుగురు నిందితులు అతడిని చుట్టుముట్టారు. రవి, జహంగీర్ లు బాధితుడు కిందకు దిగకుండా అడ్డుకోగా, శ్యామ్ సుందర్ , విశాల్ లు అతడిని వెనుక నుంచి నెట్టారు. ఈ విధంగా బాధితుడి దృష్టి మళ్లించిన తరుణంలో, ప్రధాన నిందితుడు విశాల్ చేతితో గొలుసు హుక్ లాగి, క్షణాల వ్యవధిలో దొంగిలించి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ముఠాలోని సభ్యులంతా జల్సాలకు అలవాటు పడి, సులభంగా డబ్బు సంపాదించడానికి ఒక వ్యవస్థీకృత నేర ముఠాగా ఏర్పడ్డారు. గతంలోనూ వీరు పలు దొంగతనాల్లో పాల్గొని జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నమ్మదగిన సమాచారంతో నిందితుడు హథకడే విశాల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు, విచారణలో అతను ఒప్పుకున్న వివిధ దొంగతనాలకు సంబంధించిన సొత్తును రికవరీ చేశారు. 9.5 గ్రాముల బంగారు గొలుసు, 5.0 గ్రాముల బంగారు గొలుసు , 4.8 గ్రాముల బంగారు గొలుసు, 10.4 గ్రాముల బంగారు గొలుసు రికవరీ చేశారు. పరారీలో ఉన్న మిగతా ముగ్గురు నిందితుల (రవి, జహంగీర్, శ్యామ్ సుందర్) కోసం పోలీసులు గాలిస్తున్నారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఏసీపీ టి. శ్రీనివాస్ ల పర్యవేక్షణలో అత్తాపూర్ ఎస్.హెచ్.ఓ కె. నాగేశ్వరరావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. రాజు నాయక్, వారి బృందం చాకచక్యంగా వ్యవహరించి ఈ ముఠాను పట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించి, రివార్డులను ప్రకటించారు.



# రక్షణ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు చెక్



**మందమర్రి, జూలై 10 (క్రైమ్ మిర్రర్) :** గనుల్లో ప్రమాదాల నివారణకు రక్షణ నిబంధనల అమలులో రాజీపడకూడదని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యోగులంతా భద్రతా సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని డీఎంఎస్ (మైనింగ్) సాగేష్‌కుమార్ సూచించారు. బెల్లంపల్లి, మందమర్రి ఏరియాల 24వ త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం శుక్రవారం మందమర్రి ఎల్లందు క్లబ్‌లో నిర్వహించారు. సమావేశానికి ముందు డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, డీజీఎంఎస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. గని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన కార్మికులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. డీఎంఎస్ సాగేష్‌కుమార్ మాట్లాడుతూ భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రమాదాలను పూర్తిగా నివారించే దిశగా ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో అనుభవజ్ఞులను మాత్రమే విధుల్లో నియమించాలని, ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణిలో రక్షణ చర్యల అమలుకు యాజమాన్యం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూనే ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్న ఉద్యోగులు, అధికారులను అభినందించారు. కార్పొరేట్ సేఫ్టీ జీఎం సాయిబాబు మాట్లాడుతూ ప్రతి గనిలో 'సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్'పై ఉద్యోగులకు నిరంతర శిక్షణ, అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు గనుల్లో కార్మికుల భద్రత కోసం ఆధునిక యంత్రాలు, నూతన సాంకేతికతను మరింతగా వినియోగించాలని కోరగా, ఆ సూచనలను పరిశీలించి అమలు చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో డీడీఎంఎస్ దీపక్‌కుమార్ ప్రభాకర్, కోమల్ చౌదరి, మందమర్రి ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ, బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం. శ్రీరమేష్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం సాయిబాబు, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, ఎస్. తిరుపతి, రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, జీఎం (రెస్క్యూ) శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఏజెంట్లు, గని మేనేజర్లు, సేఫ్టీ అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఏబీవీపీ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం, అలాగే 78వ ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శంషాబాద్‌లో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక టాప్ బేకరీ చౌరస్తా నుండి ఆర్‌బీ నగర్ గ్రౌండ్ వరకు వందలాది మంది విద్యార్థులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు చేసిన దేశభక్తి నినాదాలు, విద్యార్థి చైతన్య నినాదాలతో శంషాబాద్ పట్టణం మార్మోగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏబీవీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎస్. కరుణాకర్ మాట్లాడుతూ.. 1949 జూలై 9న ఆవిర్భవించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఎదిగి దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులను చైతన్యవంతం చేస్తోందని కొనియాడారు. గత 78 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల పరిరక్షణ, నాణ్యమైన విద్య కోసం నిరంతరం ఉద్యమిస్తోందని తెలిపారు. జాతీయ పునర్నిర్మాణం, సామాజిక సేవ, నాయకత్వ వికాసం వంటి రంగాల్లో ఏబీవీపీ విశేష సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు. జ్ఞానం శీలం ఏకత అనే త్రిసూత్రం ఏబీవీపీకి మార్గదర్శకమని పేర్కొంటూ జ్ఞానం వ్యక్తిత్వ వికాసానికి, శీలం సమాజ విశ్వాసానికి, ఏకత దేశ సమగ్రతకు ప్రతీకలని ఆయన వివరించారు. విద్యార్థి కేవలం ఉద్యోగం కోసమే కాకుండా, దేశ భవిష్యత్తును నిర్మించే బాధ్యతగల పౌరుడిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, నాణ్యమైన విద్య, పారదర్శక విద్యా విధానం, అవినీతి నిర్మూలన, క్యాంపస్ అభివృద్ధి వంటి అంశాలపై ఏబీవీపీ అనేక ఉద్యమాలు చేపట్టిందని కరుణాకర్ గుర్తుచేశారు. సామాజిక సేవలో భాగంగా రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సైబర్ సెక్యూరిటీ అవగాహన, డ్రగ్స్ నిర్మూలన వంటి కార్యక్రమాలతో సమాజంలో విశిష్టమైన సేవలు అందిస్తోందని తెలిపారు. దేశ అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం వేలాది మంది ఏబీవీపీ కార్యకర్తలు జైలు శిక్షలను సైతం ఎదుర్కొన్నారని, దేశ సమైక్యత, జాతీయ భద్రత, సరిహద్దుల రక్షణపై ఏబీవీపీ ఎప్పటికప్పుడు తన గళాన్ని వినిపిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంఘటన కార్యదర్శి పరశురామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, శంషాబాద్ నగర కార్యదర్శి బత్తుల భరత్, రాష్ట్ర ఖేల్ కో-కన్వీనర్ అఖిల్, నగర కార్యకర్తలు దినేష్, మనీష్, వేణు, తిరుపతి, వెంకట్ భరద్వాజ్, వినయ్ తదితర కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాజేంద్రనగర్ వార్డులో ముమ్మరంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ డ్రైవ్

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం శరవేగంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేసే లక్ష్యంతో అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. భాగంగా, ఎస్ఎల్ఎఫ్ గ్రూపుల్లోని మహిళలు, వారి కుటుంబ సభ్యులందరూ ఎస్ఐఆర్ ఫారాలను పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో త్వరితగతిన నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని యూసీడీ--మెప్మా బృందాలకు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల అనుగుణంగా రాజేంద్రనగర్ వార్డులో డీపీఓ స్వాతి నేతృత్వంలో యూసీడీ, మెప్మా సిబ్బంది క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. సిబ్బంది ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, స్థానిక మహిళలకు మరియు వారి కుటుంబ సభ్యులకు ఎస్ఐఆర్ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. నివాసాల వద్దనే ఓటర్ల నుంచి ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా నింపించి, అవసరమైన వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించిన అనంతరం వాటిని సేకరించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఓటరు నూతన నమోదు, సవరణల ప్రక్రియను వేగవంతం చేసేందుకు చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డీపీఓ స్వాతి, సీఓ లక్ష్మణ్ తో పాటు మెప్మా బృందం, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు, ఎస్ఎల్ఎఫ్ సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఇంటింటికీ చేరుతున్న ఎస్ఐఆర్ ఓటర్ ఫారాలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ నమోదు ఫారాలను విస్తృతంగా పంపిణీ చేస్తూ, పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోచమ్మ కాలనీలో బీఎల్వో హనుమంతు కాలనీలోని వివిధ ఓటర్లను కలిసి ఎస్ఐఆర్ ఓటర్ ఫారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ కే. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ ఓటర్ నమోదు ఫారాన్ని తప్పనిసరిగా నింపి సంబంధిత బీఎల్వోలకు అందజేసి ఓటరు జాబితాను పూర్తి స్థాయిలో నవీకరించేందుకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, మహమ్మద్ బషీర్, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాల్ రెడ్డి, ఏర్పుల కుమార్, నాయకులు శ్రవణ్ కుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్‌నగర్ ప్రధాన రహదారి సమస్యకు త్వరలో పరిష్కారం కోసం కృషి చేస్తాం



**కూకట్ పల్లి, జూలై 10 (క్రైమ్ మిర్రర్):** నాలుగు దశాబ్దాలుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న గోపాల్‌నగర్ ప్రధాన రహదారి సమస్యపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ స్పందించారు. ప్లాట్ యజమానుల విజ్ఞప్తి మేరకు ఆయన శుక్రవారం గోపాల్‌నగర్ ప్రధాన రహదారిని ప్రత్యక్షంగా సందర్శించి, బాధితులతో సమావేశమై వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లాట్ యజమానులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, గోపాల్‌నగర్ లేఅవుట్ 1980లో ఆమోదం పొందగా, 1981లో తాము చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేశామని తెలిపారు. ఆ సమయంలో ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ప్రధాన రహదారి వెడల్పు 40 అడుగులు మాత్రమే ఉండేదని, తమ వద్ద ఉన్న అన్ని రిజిస్టర్డ్ అమ్మకపు పత్రాల్లో కూడా అదే స్పష్టంగా నమోదై ఉందని వివరించారు. అయితే ప్రస్తుతం 120 అడుగుల రహదారి పేరుతో తమ భూములను సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది పూర్తిగా అన్యాయమని వారు వాపోయారు. మూసాపేట నుంచి లింగంపల్లి వరకు ఇదే ప్రధాన రహదారి చాలా ప్రాంతాల్లో 60 నుంచి 80 అడుగుల వెడల్పుతో మాత్రమే కొనసాగుతుండగా, గోపాల్‌నగర్ ప్రాంతంలో మాత్రమే 120 అడుగుల రహదారి పేరుతో భూములు తీసుకోవడం న్యాయబద్ధం కాదని స్పష్టం చేశారు. ఈ వివాదం దాదాపు 40 సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా కొనసాగుతోందని, చట్టబద్ధంగా ప్లాట్లు కొనుగోలు చేసిన తమ హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని వారు బండి రమేష్‌ను కోరారు. ప్లాట్ యజమానులు సమర్పించిన పత్రాలను పరిశీలించిన అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ, సమస్య తీవ్రతను పూర్తిగా అర్థం చేసుకున్నానని, సంబంధిత ప్రభుత్వ అధికారులు, శాఖలతో చర్చించి చట్టబద్ధమైన, న్యాయమైన పరిష్కారం త్వరితగతిన లభించేలా అన్ని విధాలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు నష్టం జరగకుండా, వారి హక్కులు కాపాడే దిశగా తన వంతు బాధ్యతను నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తమ సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి, పరిష్కారం కోసం ముందుకు రావడంతో పాటు భరోసా కల్పించినందుకు గోపాల్‌నగర్ మెయిన్ రోడ్ ప్లాట్ యజమానులు బండి రమేష్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, వినోద్ చావా, శ్రీనివాస్, తిలక్, అనిల్, సుధాకర్, జనార్ధన్‌తో పాటు పలువురు ప్లాట్ యజమానులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కిస్మత్‌పూర్‌లో జోరుగా ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, రాజకీయ నాయకులు కోరారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్యూమరేషన్ కేంద్రాన్ని ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించి కిస్మత్‌పూర్‌లో 100% ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు గోకరి సురేష్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫారాల సమర్పణపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా కరెక్టుగా పూర్తి చేసి అందించాలని ఆయన కోరారు. ఫారాలు నింపడం తెలియని వారు లేదా ఇబ్బంది పడే పబ్లిక్ ఉంటే, బూత్ లెవెల్ అధికారులు వారికి పూర్తి స్థాయిలో సహకరించి, ఫారాలను పూర్తి చేసి ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ఎవిఓపిఎ రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండలో ఎవిఓపిఎ ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్ జన్మదినం మణికొండ లో గల వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎవిఓపిఎ రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ మాట్లాడుతూ ఈ ప్రపంచంలో వచ్చేటువంటి ఏ కష్టాన్నైనా ఏదో విధంగా జయించవచ్చు, కానీ వృద్ధాప్యాన్ని జయించడం అనేది చాలా కష్టం, కావున మణికొండలో మేము పుట్టినరోజు సందర్భంగా మాకు తోచిన విధంగా భక్తిగా వృద్ధాశ్రమాలకు సాయం చేస్తూ వృద్ధాశ్రమంలో పుట్టినరోజు జరుపుకోవడం జరిగింది. మానవసేవయే మాధవసేవ లక్ష్యంతో పనిచేస్తున్న ఎవిఓపిఎ మణికొండలో ప్రతి కార్యక్రమాన్ని ఏదో రూపంలో నిజమైన లబ్ధిదారులకు చేరాలని లక్ష్యంతో పని చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఎవిఓపిఎ రాష్ట్ర నాయకులు కట్ట రవికుమార్, వీరబొమ్మ రమేష్, జిల్లా కోశాధికారి సాయిరాం, పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షులు దారం వేణుమాధవ్, మహిళా విభాగం కార్యదర్శి కోశాధికారి మహాలక్ష్మి, దేవి ప్రియ, పెద్దలు దారం మల్లయ్య, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# జూలై 15న హైదరాబాద్‌లో జరిగే నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయండి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు నాగుల్ పాషా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఇంచార్జి బండి రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతతో చెలగాటం ఆడుతూ మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందని, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నిరుద్యోగ సంక్షేమానికి తగిన ప్రాధాన్యం కల్పించలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే నిరుద్యోగ సదస్సును విజయవంతం చేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల నుంచి నిరుద్యోగ యువత, యువకులు, యువతులు పెద్ద సంఖ్యలో ఈ సదస్సులో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగుల్ పాషా, జిల్లా కార్యదర్శి బొడ్డు మధు, నాయకులు భూక్యా ప్రసాద్, రావులపాటి నాగరాజు, వద్రణపు మధు, జిల్లా కమిటీ సభ్యులు, మండల మరియు పట్టణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.



# గంజాయి ఊబిలో యువత.. హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ రాకెట్ బట్టబయలు



**ఈగల్ ఫోర్స్ మెరుపు దాడులు 29 మంది అదుపులోకి**

**గంజాయి విక్రేత అరెస్ట్.. 78 ఏళ్ల మహిళ పరారీ**

**బాలానగర్, జూలై 10 (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్ (ఈలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్) చేపట్టిన మెరుపు దాడుల్లో మరో భారీ గంజాయి రాకెట్ వెలుగులోకి వచ్చింది. ప్రజలు అందించిన సమాచారంతో ఈగల్ ఫోర్స్ అధికారులు వేగంగా స్పందించి నిర్వహించిన దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠాను గుర్తించి కీలక నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1908కు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ పరిధిలోని ఫతేనగర్ ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు నిర్ధారించుకున్న అనంతరం అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి విక్రయిస్తున్న ఆకాశ్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 17.8 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అక్కడ ఉన్న పలువురికి డ్రగ్ పరీక్షలు నిర్వహించగా, 29 మందికి డ్రగ్ టెస్ట్ పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వారందరినీ అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. 78 ఏళ్ల చంద్రమ్మ అనే మహిళ చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో గంజాయిని విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే దాడుల సమయంలో ఆమె పరారవడంతో, ఆమె కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ వ్యవహారంపై మాదకద్రవ్యాలు మరియు మానసిక ప్రభావిత పదార్థాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్ చట్టం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ రాకెట్ వెనుక మరెవరైనా ఉన్నారా? గంజాయి సరఫరా ఎక్కడి నుంచి జరుగుతోంది? యువతను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న ముఠాలకు సంబంధాలు ఉన్నాయా? అనే కోణాల్లో కూడా పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. తమ పరిసరాల్లో మాదకద్రవ్యాల విక్రయాలు, వినియోగం లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతోందని, సమాజం, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, పోలీసులు కలిసి పనిచేస్తేనే ఈ ముప్పును సమర్థంగా అరికట్టగలమని అధికారులు పేర్కొన్నారు. నగరంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ఈగల్ ఫోర్స్ తన తనిఖీలు, దాడులు మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.



# వడ్డేపల్లి నర్సింగ్ రావు ఆశయసాధనే నిజమైన నివాళి...వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్ పల్లి, జూలై 10 (క్రైమ్ మిర్రర్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భూ ఖనిజాభివృద్ధి శాఖ మాజీ చైర్మన్ స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు జయంతిని పురస్కరించుకొని కూకట్‌పల్లి లోని పలు ప్రాంతాలలో వారి అభిమానుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం అభిమానులతో కలిసి జయంతి వేడుకలను నిర్వహించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ వడ్డేపల్లి నర్సింగ్ రావు ప్రజాసేవను జీవిత ధ్యేయంగా భావించి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమించిన మహోన్నత నాయకుడు. పదవిని ప్రజాసేవకు సాధనంగా ఉపయోగించుకొని, నిరాడంబర జీవనం, నిబద్ధత, నిజాయితీతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వారి ఆదర్శాలు, విలువలు, సేవా స్ఫూర్తి నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయి. వారి ఆశయ సాధనే వారికి మనం అర్పించే నిజమైన నివాళి. సమాజాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం వారు చూపిన బాటలో నడుస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని" అన్నారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కాలనీ పెద్దలు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వడ్డేపల్లి నర్సింగ్ రావు కి ఘన నివాళులు అర్పించారు.

# ప్రభుత్వ పాఠశాల భవనానికి రంగులు వేయించిన నర్వ పవన్




**కూకట్ పల్లి, జూలై 10 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ మూడవ ఫేజ్ భువన విజయం గ్రౌండ్స్ సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం, పాఠశాల గదులు సరికొత్త పెయింటింగ్‌తో నూతన శోభను సంతరించుకుంది. గత కొన్ని ఏళ్లుగా రంగులు వెలిసిపోయి వెలవెల బోయిన పాఠశాల పరిస్థితిని చూసిన దాత నర్వ పవన్ కుమార్ చలించిపోయి తన స్వంత ఖర్చులతో పాఠశాల భవనానికి, పాఠశాల ప్రాంగణానికి రంగులు వేయించడంతో పాఠశాల నేడు పెయింటింగ్‌తో నూతన శోభను సంతరించుకుంది. ప్రభుత్వ పాఠశాలను తన సొంత ఖర్చులతో నర్వ పవన్ కుమార్ రంగులు వేయించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ మాట్లాడుతూ రంగులు వెలిసిపోయి వెలవెలబోతున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని చూసిన దాత నర్వ పవన్ కుమార్ ముందుకు వచ్చి పెయింటింగ్ వేయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఆహ్లాదకరంగా, అందంగా మారిన తరగతి గదులను చూసి పిల్లలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. మా విద్యార్థులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, వారికి ఇంతటి చక్కని వాతావరణాన్ని బహుమతిగా ఇచ్చిన నర్వ పవన్ కుమార్ కు పాఠశాల తరపున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్ననన్నారు.

# కేఎల్ఐ కాల్వ మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు ఒక జెసిబి స్వాధీనం.. కేసు నమోదు

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామంలోని కేఎల్ఐ కాల్వ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మరియు జెసిబి ని స్వాధీనం చేసుకుని స్టేషన్కు తరలించినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. ఇట్టి వాహనాల డ్రైవర్లు, ఓనర్ల పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను, మట్టిని తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఐఐఎస్‌సీలో మెరిసిన పర్వేద గ్రామ మహిళా నాగ జ్యోతి

**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి::** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన పుల్లగుర్ల నాగ జ్యోతి తన అసాధారణ ప్రతిభతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. దేశంలోనే అత్యున్నత విద్యా, పరిశోధనా సంస్థగా పేరుగాంచిన బెంగళూరులోని భారతీయ విజ్ఞాన సంస్థ ఎస్ సి,ల లో జీవరసాయన శాస్త్రం బయో కెమిస్ట్రీ విభాగంలో డాక్టరేట్ (పీహెచ్‌డీ) పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు. శుక్రవారం జరిగిన ఐఐఎస్‌సీ స్నాతకోత్సవంలో ఆమె పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. పర్వేద గ్రామానికి చెందిన యువతి ఈ ఘనత సాధించడంతో గ్రామస్తులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఉద్యోగాన్ని వదిలి.. పరిశోధననే లక్ష్యంగా ఎంచుకున్న నాగ జ్యోతి**

నాగ జ్యోతి బీఎస్సీ చదువుతున్న సమయంలోనే క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ప్రముఖ ఐటీ సంస్థ లిలివిప్రో విప్రో లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. అయితే ఉద్యోగ జీవితం కంటే శాస్త్రీయ పరిశోధనలపై ఉన్న ఆసక్తితో ఆ అవకాశాన్ని వదులుకుని ఉన్నత విద్యను ఎంచుకున్నారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ పూర్తి చేశారు. పెళ్లి, కుటుంబ బాధ్యతల కారణంగా రెండేళ్ల పాటు చదువుకు విరామం వచ్చినప్పటికీ, తన లక్ష్యాన్ని మరువకుండా తిరిగి పరిశోధనా రంగంలోకి అడుగుపెట్టి కృషిని కొనసాగించారు.

**అంకితభావం.. పట్టుదలతో సాధించిన విజయం**

ఐఐఎస్‌సీలో ప్రొఫెసర్ డెబ్రబ్రత లాహా మార్గదర్శకత్వంలో చేరిన నాగ జ్యోతి, "మొక్కల్లో ఫాస్ఫేట్ సిగ్నలింగ్ మరియు ఇనోసిటాల్ ఫాస్ఫేట్ మెటాబాలిజం" అనే క్లిష్టమైన అంశంపై పరిశోధనలు చేసి విజయవంతంగా డాక్టరేట్ పూర్తి చేశారు. ఒకవైపు భార్యగా, తల్లిగా కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, మరోవైపు అత్యున్నత స్థాయి పరిశోధనను పూర్తి చేయడం ఆమె సంకల్పబలానికి నిదర్శనంగా నిలిచింది. తల్లిదండ్రులు, భర్త అందించిన ప్రోత్సాహం తన విజయానికి ఎంతో దోహదపడిందని నాగ జ్యోతి తెలిపారు. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి, కఠోర శ్రమ, పట్టుదలతో దేశ అత్యున్నత విద్యా సంస్థలో పీహెచ్‌డీ సాధించడం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు ఆదర్శంగా నిలుస్తోందని గ్రామస్తులు, విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు. పర్వేద గ్రామానికి ఆమె తీసుకొచ్చిన ఈ అరుదైన గౌరవం స్థానికులకు గర్వకారణంగా మారింది.





# లక్ష్మీగూడలో గంజాయి విక్రయంపై మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల మెరుపు దాడి-కిలో గంజాయితో వ్యక్తి అరెస్ట్

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ పింక్ బిల్డింగ్ సమీపంలో గంజాయి విక్రయం జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో పోలీసులు శుక్రవారం ప్రత్యేక దాడి నిర్వహించారు. ఈ దాడిలో గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి సుమారు ఒక కిలో ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, అరెస్టైన వ్యక్తి అజయ్ కుమార్ యాదవ్ (34). ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జల్పల్లి గ్రామంలో నివాసం ఉంటూ, ఓ డెయిరీ ఫామ్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడు స్వస్థలంగా బిహార్ రాష్ట్రానికి చెందినవాడని విచారణలో వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి సుమారు ఒక కిలో ఎండు గంజాయి, ఒక మొబైల్ ఫోన్, రూ.2,000 నగదును చట్టపరమైన విధానాల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై మాదక ద్రవ్యాలు మరియు మానసిక ప్రభావం కలిగించే పదార్థాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్ చట్టం) లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గంజాయిని ఎక్కడి నుంచి తెచ్చాడు, ఎవరికి విక్రయిస్తున్నాడు, ఈ వ్యవహారంలో మరెవరైనా ఉన్నారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ఇటువంటి కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కోరారు.

# విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి అరుదైన సేవలు...!

**పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం**

**శిబిరంలో పాల్గొన్న పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణ కోసం శ్రీ విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్,తుక్కుగూడ ఆధ్వర్యంలో పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. రాజేష్, ఆర్‌జీఐఏ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వి. శ్రీకాంత్ గౌడ్,పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ బి. లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్సై దయాకర్ రెడ్డి,ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బంది మరియు, కుటుంబ సభ్యులకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు మరియు ఇతర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఆరోగ్య పరిరక్షణ, సమతుల ఆహారం, వ్యాయామం మరియు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ ఫిజీషియన్ డా.ప్రశాంత్, గైనకాలజిస్ట్ డా.సుభాషిణి, ఆర్ఎంఓ డా.భార్గవి పాల్గొని పోలీసు సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సమస్యలపై తగిన సలహాలు, సూచనలు అందించారు. శ్రీ విశిష్ట మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సీఎండీ డా.ఆర్ రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం అహర్నిశలు సేవలందిస్తున్న పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో కూడా పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో పాటు సాధారణ ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు మరియు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని నిర్వహించిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర వైద్య సిబ్బందిని పోలీసు అధికారులు అభినందించారు.



Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.